తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-11- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 76 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# తమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టి తీరుతాం

- తమ్మిడిహెట్టి నిర్మాణంపై ఉత్తమ్‌కుమార్ రెడ్డి హామీ
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనితీరుపై విమర్శలు
- గోదావరి–కావేరి అనుసంధాన ప్రతిపాదన
- దేవాదుల ప్రాజెక్టు పూర్తి పై భట్టి విక్రమార్క దృష్టి
- జవహర్ ఎత్తిపోతల పథకం శంకుస్థాపన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టి తీరుతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తమ్మిడిహెట్టి కట్టి ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించి ఉంటే 16 లక్షల ఎకరాలకు నీరు అందేదని, కానీ గత ప్రభుత్వం ప్రణాళికలు లేకుండా మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిందని విమర్శించారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన అప్పులకు రానున్న రోజుల్లో రూ.40 వేల కోట్ల అసలు, రూ.26 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి ఉందన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ నివేదికను బట్టి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని స్పష్టం చేశారు.

మిగతా 2లో





# వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

## సీఎం రేవంత్ ఆదేశాలు

- అమీర్‌పేట, బల్కంపేట, బౌద్ధనగర్ ప్రాంతాల ఆకస్మిక పర్యటన
- కాలువల ఎత్తు, నిర్మాణాల కారణంగా ముంపు సమస్యపై ఆవేదన
- గంగుబాయి బస్తీ కుంట ఆక్రమణలపై సీఎం ఆదేశాలు
- జశ్వంత్ బాలుడితో సీఎం చర్చ.. పుస్తకాల నష్టం, హామీ
- వ్యవసాయశాఖ అంశాలపై మంత్రి తుమ్మల, సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాజధాని నగరంలోని బస్తీల్లో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక ట్రంక్ లైన్ ఏర్పాటుచేసి ఈ సమస్యను పరిష్కరించాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి భారీ వర్షాలకు నగరంలోని పలు కాలనీలు, ప్రాంతాల్లోకి వరద రావడం, ఇళ్లలోకి నీరు చేరిన నేపథ్యంలో.. ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పర్యటించారు.

మిగతా 2లో



# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

- బీఆర్ఎస్ పాలనపై మంత్రి వివేక్ తీవ్ర విమర్శలు
- జైపూర్ పవర్ ప్లాంట్ శంకుస్థాపనకు సీఎం రేవంత్ సిద్ధం
- స్థానికులకు 80 శాతం ఉద్యోగాల భరోసా
- చెన్నూరులో భూ, ఇసుక దందాలకు ముగింపు
- కోటపల్లి ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు రూ.200 కోట్లు మంజూరు
- అమృత్ 2.0 కింద తాగునీటి, రోడ్ల పనులు శరవేగం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభి వృద్ధి శూన్యమని, కుంభకోణాలు తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఐదేళ్లు పార్లమెంట్ సభ్యుడిగా, ఐదేళ్లు ప్రభుత్వ విప్‌గా పనిచేసిన బాల్క సుమన్ నియోజకవర్గంలో ఏ విధంగా వ్యవహరించాడో ప్రజలందరికీ తెలుసన్నారు. ఆది వారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని జైపూర్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటుకు మరి కొన్ని రోజుల్లో శంకుస్థాపన చేయనున్నామని, దీన్ని సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపా రు.

మిగతా 2లో

# ఎన్నికల కమిషన్ అక్రమాలపై కాంగ్రెస్ పవర్ పాయింట్ ప్రదర్శన

## పిపిటిని వీక్షించిన వరంగల్ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు

హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ అక్రమాలపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సిద్ధం చేసిన పీపీటీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, బీహార్ ఓటర్ల జాబితాలో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయని, రాహుల్ గాంధీ ఆధారాలతో ప్రశ్నించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఇప్పటివరకు స్పందించలేదని అన్నారు. ఒక్క నియోజక వర్గంలోనే లక్ష ఓట్లు పెరగడం, ఒకే ఇంటి నంబర్‌పై వందలాది ఓటర్ల నమోదు వంటి ఉదాహరణలు

మిగతా 4లో






# రవీంద్రభారతిలో శివశంకర్ జయంతి ఉత్సవాలు..

- రాజ్యాంగ పరిరక్షణలో శివశంకర్ సేవలు: మంత్రి పొన్నం
- రాజకీయ కుటుంబం లేకపోయినా శిఖరాగ్రానికి ఎదుగుదల
- శివశంకర్ విగ్రహాల ఏర్పాటుకు ప్రణాళికలు
- సామాజిక న్యాయం కోసం శివశంకర్ పోరాటం: అద్దంకి దయాకర్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఆదివారం దివంగత నేత పుంజల శివశంకర్ 96వ జన్మదినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో ఆయన జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.
రాజ్యాంగ పరిరక్షణ, న్యాయం, వెనుకబడిన వర్గాల సాధికారత కోసం పనిచేసిన ప్రజాసేవకుడిగా.. శివశంకర్‌కు గొప్ప పేరుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తాను విద్యార్థిగా రాజకీయల్లో ఉన్నపుడు శివశంకర్ కాంగ్రెస్ పార్టీలో ఎన్నో బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని చెప్పుకొచ్చారు.

మిగతా 2లో

## రాయదుర్గం వద్ద కారు అదుపుతప్పి

# సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

- డివైడర్ ఢీకొని నాలుగు పల్టీలు
- రూపక్ త్రిపాఠికి తీవ్ర గాయాలు
- మొబైల్ యాప్ లాంచ్ కోసం చత్తీస్‌ఘడ్ నుంచి స్నేహితుల రాక




హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

అదుపు తప్పి కారు పల్టీ కొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. చత్తీస్‌ఘడ్ రాయపూర్‌కు చెందిన రూపక్ త్రిపాఠి (30) మాదాపూర్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు.

2లో

# పేదల ఆత్మగౌరవం నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం

- వేములవాడలో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగం: ఆది శ్రీనివాస్
- బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వైఫల్యం పై విమర్శలు
- ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- పూరి గుడిసె నుంచి డబుల్ బెడ్‌రూం ఇంటికి హామీ



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పేదల ఆత్మగౌరవం నిలబెట్టడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చెక్కపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదింటి సొంతింటి కల నెలరవేర్చుతున్నామన్నారు.

మిగతా 2లో

# భారత్‌లో టెస్లా బిగ్ డీల్!.. నెలకు రూ.17.22 లక్షల రెంట్

- ముంబై తర్వాత టెస్లా రెండో షోరూం సిద్ధం
- ఢిల్లీ ఏరోసిటీలో 8,200 చదరపు అడుగుల స్థలం లీజు
- నెలవారీ అద్దె రూ. 17.22 లక్షలు, 10 పార్కింగ్ స్లాట్లు
- రూ. 1.03 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్
- లీజు రేటు సంవత్సరానికొకసారి పెరుగుదల

4లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

అమీర్‌పేట ప్రాంతంలోని మైత్రీవనం, గంగుబాయి బస్తీ, బౌద్ధనగర్, బల్కంపేట లోని బస్తీలను పట్టణాభివృద్ధి శాఖ కార్యద ర్శి ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ముంపు సమస్య ఎన్నేళ్లుగా ఉంది, స్థానికు లు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటనేది నేరుగా బస్తీవాసులను ఆరా తీశారు. కాగా, బల్కంపేట నుంచి వచ్చే వరద నీటి ప్రవాహా నికి అడ్డుగా కొన్ని ఇళ్లను నిర్మించడం వల్ల సమస్య వస్తోందని అధికారులు సీఎం వివ రించారు. ఎస్ఆర్‌నగర్ నుంచి బౌద్ధనగర్ వరకు ఉన్న డ్రైనేజీ కాలువను చూసి సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారు కాలనీ రోడ్డు కంటే డ్రైనేజీ కాలువ ఎక్కువ ఎత్తులో ఉండటంతో ఇరుకుగా మారి వరద తీవ్రత పెరుగుతోంద ని గమనించి.. వెంటనే తగిన చర్యలు చేపట్టా లని ఆదేశించారు.

గంగుబాయి బస్తీ కుంట ప్రాంతాన్ని సంద ర్శించిన సీఎం.. అక్కడి నాలా, డ్రైనేజీ వ్యవస్థ లను పరిశీలించారు. ఇళ్లలోకి నీరు రాకుండా రెండు వైపులా గోడలాంటి నిర్మాణం ఏర్పాటు చేయడం వల్ల మధ్యలో నుంచి వరద నీరు వేగంగా రావడాన్ని గమనించారు. అక్కడి కుంటను కొంతమంది పూడ్చివేసి ఓ హాస్పిట ల్ పార్కింగ్‌కు వినియోగిస్తున్నారని స్థానికు లు సీఎంకు ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా నే వరదనీరు వెనక్కి వస్తూ బస్తీ మునిగిందని అధికారులు తెలిపారు. దీంతో పూర్వాపరా లను పరిశీలించి చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్‌కు ముఖ్యమంత్రి సూచించారు. అనంతరం మైత్రీవనం వద్ద పరిస్థితిని పరిశీ లించారు. ప్యాచ్‌వర్క్ చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని, శాశ్వత పరిష్కారం కింద మొత్తం రీ డిజైన్ చేసి నీరు బయటకు వెళ్లటానికి ఏర్పాటు చేయాలని హైడ్రా కమి షనర్‌తో అన్నారు. బౌద్ధనగర్‌లో పర్యటిస్తున్న సమయంలో అక్కడ కనిపించిన జశ్వంత్ అనే బాలుడిని సీఎం పిలిచారు. కాలనీలో వరద పరిస్థితిపై అతణ్ని అడిగి ఆరా తీశారు. బాలుడి వివరాలు అడగ్గా.. తాను ఏడో తరగతి చదు వుతున్నానని, ఇంట్లోకి వరదనీరు రావడంతో పుస్తకాలు తడిసిపోయాయని చెప్పాడు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చర్యలు చేపడతామని సీఎం హామీ ఇచ్చారు. కొంతమంది బస్తీవాసులు తమ సమస్యలను విన్నవించగా శాశ్వత పరిష్కారం చూపు తామన్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ సీఎం రేవంత్‌కు రాఖీ కట్టారు. పర్యటనలో పలువురు జీహెచ్ఎంసీ కార్మికులతో ముఖ్య మంత్రి మాట్లాడారు.

సీఎం రేవంత్‌రెడ్డి అమీర్‌పేటలోని బస్తీల్లో ఎలాంటి హడావుడి, ముందస్తు సమాచారం కూడా లేకుండానే పర్యటించారు. పోలీసులు భారీ బందోబస్తు కూడా ఏర్పాటు చేయలేదు. సీఎం వెంట మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నేతలు ఎవరూ లేరు. స్థానిక బీజేపీ కార్పొరేటర్ కేతినేని సరళ ఒక్కరే సీఎం వెంట ఉండి సమస్యలను వివరించారు.

**సీఎం రేవంత్‌తో మంత్రి తుమ్మల భేటీ**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆదివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రావు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో భేటీ అయ్యారు. వ్యవసాయశాఖకు సంబం ధించిన అంశాలు, శాఖ పురోగతి, సంక్షేమ పథకాలతోపాటు శాఖాపరమైన సమస్యల ను కూడా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. వ్యవసాయ శాఖపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి అన్ని అంశాలపై సమ గ్రంగా చర్చిద్దామని ముఖ్యమంత్రి చెప్పినన ట్లు సమాచారం. సిద్దిపేటలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని, అనువైన తేదీని ఇవ్వాలని సీఎంను మంత్రి తుమ్మల కోరారు. దీంతో ఈ నెలాఖరులో ప్రారంభోత్సవం చేద్దామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిసింది. సిద్దిపే టలో రిఫైన్డ్ ఆయిల్ యూనిట్ ఏర్పాటు అంశంపైనా చర్చ జరిగింది. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న తుమ్మల ఆ జిల్లాకు సంబం ధించిన అంశాలను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

# తమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టి తీరుతాం

(మొదటి పేజీ తరువాయి)



ఆదివారం ములుగు జిల్లా కన్నాయి గూడెంలో గోదావరిపై నిర్మించిన సమ్మ క్కసారక్క బ్యారేజీని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి పరిశీలించా రు. అనంతరం దేవాదుల ప్రాజెక్టు వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే ఖమ్మం జిల్లాలో జవహర్ ఎత్తిపో తల పథకం శంకుస్థాపన సందర్భంగా కూడా మాట్లాడారు. ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఇక్కడే గోదావరి, కావేరి నదు ల అనుసంధానా నికి ప్రాజెక్టు నిర్మించాలని కేంద్రానికి ప్రతి పాదన చేశానని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ ఇచ్చిన నివేదికను అపహా స్యం చేసేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం హేయమని విమర్శించా రు. కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ రిపోర్టు జడ్జి తీర్పులాంటిదన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ కోసం 2 లక్షల కోట్ల అప్పులు చేసిందని, వాటికి ఏటా రూ.16 వేల కోట్ల అసలు, వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పారు. నీటి పారుదల శాఖకు కేటాయించిన రూ.23 వేల కోట్లలో 70u వాటికే పోతు న్నాయన్నారు. సమ్మక్క బ్యారేజీపై ఛత్తీస గఢ్ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందన్నారు. ఎంత నష్టం జరిగినా తెలంగాణ ప్రభుత్వం భరిస్తుందని ఛత్తీస గఢ్‌కు తెలిపామని, త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**దేవాదులను పూర్తి చేస్తాం: భట్టి విక్రమార్క**

బనకచర్లను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునే ది లేదని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ నిటారుగా నిలబడ్డారు కాబట్టే ఏపీ చేపట్టిన బనకచర్ల, రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆగాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కేసీఆర్ ముఖ్యమం త్రి, కేంద్రంలో మోదీ ప్రధాని అయిన తర్వాత అమాయకులైన గిరిజనులకు సంబంధించిన 2 లక్షల ఎకరాలను ఆర్డినెన్స్ ఇచ్చి పోలవరం కట్టుకోవడాని కి ధారాదత్తం చేశారన్నారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తమ ప్రభు త్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. దేవాదులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 33 వేల ఎకరాలకు నీరందించేందుకు రూ.630 కోట్లతో చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకానికి భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎర్రుపాలెం మండలం మొ లుగుమాడులో పైలట్ ప్రాజెక్టు మాదిరిగా నే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం వంటి పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. బీఆ ర్ఎస్ హయాంలో రూ.లక్షల కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలిపోయింద ని, అలా కాకుండా తక్కువ వ్యయంతో 30 వేల ఎకరాలకు నీరిచ్చేలా జవహర్ ఎత్తిపోతల పథకం రూపొందించామని మంత్రి వాకటి శ్రీహరి అన్నారు. మంత్రి సీతక్క, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

(మొదటి పేజీ తరువాయి)

దీంతో 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. స్థానికులకు ఉ ద్యోగాలు ఇవ్వాలని సింగరేణిని కోరగా 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే రా నున్నాయన్నారు. శంకుస్థాపనకు సీఎం హాజరవుతారని తెలిపారు. చెన్నూరు ని యోజకవర్గంలో భూ దందా, ఇసుక దందా అక్రమాలు జరిగా యని, తాను గెలి చిన తర్వాత వీటన్నింటికీ ముగింపు పలికానని తెలిపారు. నియోజక వర్గంలోని కోటపల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశా లకు 200 కోట్లు మంజూరు చేశామని, త్వర లోనే టెండర్లు పిలిచి పనులు కూడా ప్రారంభి స్తామన్నారు. తాను విద్య, వైద్యానికి పె ద్దపీట వేస్తున్నానని తెలిపారు. తనను విమర్శించే అర్హత ఎవరికి లేదన్నారు. కేసీఆర్ ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలో చెన్నూరు ఎమ్మెల్యే కేసీఆర్ చిన్న కొడు కునని చెప్పుకుని రైల్వే బ్రిడ్జి పనులు, ఇతర పనులు ఎందుకు చేయ లేదన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లు ఇతర పనులను కమీషన్‌ల కోసమే చేశారన్నారు.



మంత్రికి రాఖీలు కట్టిన మహిళలు

కాం గ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. నియో జకవర్గంలో భవిష్యత్‌లో తాగునీటి సమస్య లేకుండా వంద కోట్లతో అమృత్ 2.0 పథకం కింద పనులు శరవేగంగా జరుగు తున్నాయన్నారు. వార్డుల్లో రోడ్లు, డ్రైనే జీలు, తాగునీటి అవసరాలను తీరుస్తున్నామన్నా రు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర గనుల, కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెం కటస్వామికి ఆదివారం మహిళలు రాఖీలు కట్టారు. మంత్రి క్యాంపు కార్యాలయానికి రాగానే మహిళలు వచ్చి రాఖీలు కట్టి ఆశీ ర్వదించారు. అన్నాచెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ అని తెలిపారు.

# రాయదుర్గం వద్ద కారు అదుపుతప్పి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి




(మొదటి పేజీ తరువాయి)

కేపీహెచ్‌బీలో తమ్ముడు శాశ్వత్ త్రిపాఠితో కలిసి నివాసం ఉంటున్నారు. స్నేహితులతో కలిసి ఎర్టిగా కారులో కేపీహెచ్‌బీ నుంచి నాలెడ్జీ సిటీకి వెళుతుండా టీ హబ్ రోడ్డులో శనివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. నాలుగు పల్టీలు కొట్టడంతో బెలూన్ తెరుచుకున్నప్పటికీ డ్రైవింగ్ చేస్తు న్న రూపక్ త్రిపాఠి తలకు తీవ్ర గాయాల య్యాయి. మాదాపూర్‌లోని మెడికొవర్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. కారులో ఉన్న సోదరునితో పాటు స్నేహితులు వైభవ్ పాటిల్, ఇషాన్ త్రిపాఠి, ఎస్ రాజ్ సింగ్‌లు క్షేమంగా బయటపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ఇటీవల రూపక్ త్రిపాఠి మొబైల్ యాప్‌ను డెవలప్ చేశాడు. యాప్‌ను లాంచ్ చేయాల్సి ఉందని చెప్పి చత్తీ స్ఘడ్ నుంచి వారం రోజుల క్రితం ముగ్గురు స్నేహితులను పిలిపించుకున్నాడు. తెల్లవా రు జామున ఐటీ కారిడార్ చూసేందుకు వెళుతూ కారు అదుపుతప్పడంతో రూపక్ త్రిపాఠి తిరిగి రాని లోకాలు వెళ్లాడు. కారు ముందు చక్రం ఊడిపోయి నుజ్జునుజ్జు అయ్యింది. పోలీసులు మృత దేహనికి ఉస్మా నియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహిం చిన కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రవీంద్రభారతిలో శివశంకర్ జయంతి ఉత్సవాలు..

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయి నా.. చిన్నస్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చి ఎంతో పేరుని సంపాదించారని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ రాజకీయాల్ని కూడా ఆయన ప్రభావి తం చేశారని తెలిపారు. చిన్న వయసులోనే ఎంతో ఘనతను, పేరు ప్రతిష్టను సాధిం చారని చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. పిల్లలకి శివశంకర్ జీవిత చరిత్ర పాఠంగా చెప్పాలని మంత్రి పొన్నం సూచించారు.

తెలంగాణ నుంచి భారత దేశం స్థాయికి ఎదిగిన బలమైన నేత శివశంకర్ అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కీర్తించారు. శి



వశంకర్ పనితనాన్ని, ప్రజలకు చేసే సేవని అప్పట్లోనే ఇందిరాగాంధీ గుర్తించారని అన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వ డానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందంటే శివశంకర్ లాంటి వ్యక్తుల స్ఫూర్తి అని పేర్కొన్నారు. బీసీలకు అధికారం వచ్చిన ప్పుడే రాజ్యాంగానికి అధికారం వస్తుందని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కోసం పోరాడిన శివశంకర్ గురించి తెలంగాణ ప్రజలకే కాదు.. తెలుగు ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం ఉందని అద్దంకి దయాకర్ ఉద్ఘాటించారు.

# పేదల ఆత్మగౌరవం నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇళ్లు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికే బేస్‌మెంట్ పూర్తి చేసుకున్నాయ న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇంటిని కూడా పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజక వర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణపనులు శరవేగంగా జరుగు తున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చెర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీని వాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు అడ్డిక జైపాల్‌రెడ్డి, బొడ్ల రాములు, సోయినేని కరుణాకర్, రోమాల ప్రశాంత్, సోమినేని బాలు పాల్గొన్నారు.

**మాట ఇచ్చి... నిలబెట్టుకుని..**

వేములవాడ టౌన్: ఓ నిరుపేద మహిళ



తనకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేదని వారం రోజుల క్రితం ఆది శ్రీనివాస్‌కు మొర పెట్టుకుంది. వారం రోజుల్లో రేషన్‌కార్డు, ఆధా ర్‌కార్డులు ఇప్పించి తమ ఇంటికి వస్తానని మాట ఇచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన మాటను నిలబెట్టుకున్నారు. వేములవాడ పట్ట ణానికి చెందిన పల్లపు శారధ 17వ వార్డులో ఓ పూరి గుడిసేలో నివాసం ఉంటుంది. రేష న్‌కార్డు ఇప్పించిన విప్ శారధ ఇంటికి వెళ్లడం తో పూరిగుడిసే ఉండటంతో వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంది రమ్మ ఇళ్లు తప్పకుండా మంజూరు చేస్తానని సదరు మహిళకు హామీచ్చారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# దేవాదుల పనుల్లో ఆలస్యం, కాళేశ్వరం పై విమర్శలు

**డాక్టర్ తాటికొండ రాజయ్య**

**జఫర్‌ఘడ్, తెలంగాణ ముచ్చట్లు:**

జఫర్‌ఘడ్ మండలం సాగరం గ్రామంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టు సృష్టికర్త అని చెప్పుకునే కడియం శ్రీహరి ఇప్పటివరకు పనులు పూర్తి చేయకపోగా, 800 కోట్లు ఖర్చు చేశామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. జఫర్‌ఘడ్ మండలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తామని చెప్పి ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని విమర్శించారు.



కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం లోనే దేవాదుల పనులు 90 శాతం పూర్తయ్యాయని, ఇంకా 10 శాతం పనులు పూర్తి చేస్తే జనగాం జిల్లాలో సాగునీటి సమస్య ఉండదని పేర్కొన్నారు. కానీ కడియం శ్రీహరి ఈ విషయంలో కాలయాపన చేస్తున్నారని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై విషం చిమ్ముతూ, అది పనికిరాని ప్రాజెక్ట్ అని ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను రాజయ్య తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యల వెనుక తెలంగాణ నీటిని బనకచర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు తరలించే కుట్ర ఉందని ఆరోపించారు.

**దేవాదుల ప్రాజెక్టు ప్రగతి**

2004-05లో ₹6,016 కోట్ల అంచనాతో ప్రారంభమైన దేవాదుల ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం ₹17,500 కోట్లకు పెరిగింది. ఇప్పటివరకు ₹14,188 కోట్లు ఖర్చు కాగా, 90% పనులు పూర్తయ్యాయి. 33,224 ఎకరాల భూసేకరణలో 30,268 ఎకరాలు పూర్తయి, ఇంకా 3,000 ఎకరాలు మిగిలి ఉన్నాయి.

**రైతులకు సాగునీరు**

అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని పేర్కొన్న రాజయ్య, ఇటీవల గండ్ర వెంకటరమణారెడ్డి తో కలిసి మహా ధర్నా హెచ్చరిక ఇచ్చిన తర్వాతే మంత్రులు సమ్మక్క సారలమ్మ బ్యారేజ్‌ను సందర్శించారని అన్నారు.

**సమ్మక్క సారక్క బ్యారేజ్ వివరాలు**

2018లో ప్రారంభమైన ఈ బ్యారేజ్ ₹2,121 కోట్ల వ్యయంతో 83 మీటర్ల ఎత్తు, 1,132 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో నిర్మించబడింది. దీని సామర్థ్యం 6.94 టీఎంసీలు. 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవాదుల పంప్ హౌస్ ద్వారా 65 టీఎంసీలు లిఫ్ట్ చేయాలనే లక్ష్యం ఉంది. సీయూసీ అనుమతులు, ఛత్తీస్‌గఢ్ ఎన్‌ఓసి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రాజెక్టు ద్వారా 240 మెగావాట్ల జలవిద్యుత్, 1,500 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రణాళిక ఉంది. ప్రస్తుతం గోదావరి తీరం వెంబడి భూపాలపల్లి థర్మల్ ప్లాంట్ ద్వారా 1,100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

ప్రాజెక్టు మిగిలిన పనులను తక్షణమే పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రులను డిమాండ్ చేశారు. లేకపోతే స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో రైతులతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# అంకితభావంతో పనిచేస్తున్న ఏకైక యూనియన్ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్

- **డిజెఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు గంధం రవికుమార్**

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

వర్కింగ్ జర్నలిస్టుల హక్కుల సాధనకు నిజాయితీగా అంకితభావంతో పనిచేస్తున్న ఏకైక యూనియన్ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (డి జె ఎఫ్) అని డి జె ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు గంధం రవి కుమార్ అన్నారు. ఆదివారం డీజేఎఫ్ 5వ మహాసభ పెద్దపల్లి లో నిర్వహించారు.ఈ మహా సభలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై జనం పవర్ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.అర్.కే గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ & జనం పవర్, వాస్తవం పేపర్ వ్యవస్థాపకులు, డిజేఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి బండారి మారుతి , ప్రధాన సంపాదకులు,డీజేఎఫ్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మనసాని కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన జనం పవర్ జిల్లా సాఫ్ట్ రిపోర్టర్ గంధం రవికుమార్ ను డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (డీజేఎఫ్) జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.అనంతరం శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావాలంటే పెన్నులే గన్నులై గర్జించాలని అన్నారు.



వర్కింగ్ జర్నలిస్టుల హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటం చేస్తుంది. చిన్న, పెద్ద పత్రికల తారతమ్యం లేకుండా అక్రిడిటేషన్ల తో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టుల హక్కులకై పోరాడుతున్న ఏకైక యూనియన్ డి జె ఎఫ్ అని అన్నారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఎప్పటికప్పుడు యూనియన్ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని అన్నారు. పాదయాత్రలు, నిరాహార దీక్షలతో సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్న సంస్థ డి జె ఎఫ్ అని అన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య, ఉచిత వైద్యం, హెల్త్ కార్డుల జారీ, ఇన్సూరెన్స్ లాంటి ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని అన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల న్యాయమైన కోరికలను తీర్చే వరకు డీజేఎఫ్ పోరాటం ఆగదని అన్నారు. పాత్రికేయులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, 60 సంవత్సరాలు నిండిన పాత్రికేయులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పాత్రికేయులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై అంగవైకల్యం కలిగిన వారికి, చనిపోయిన




వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జర్నలిస్టులకు ప్రకటించిన రాయితీలు, పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఫోర్త్ ఎస్టేట్ గా పని చేస్తున్న పత్రిక రంగంలోని పాత్రికేయులకు పత్రిక సంస్థలు జారీ చేసిన ఐడి కార్డులను ప్రామాణికంగా తీసుకొని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరారు. పేదరికంలో మగ్గుతున్న జర్నలిస్టుల కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు పది లక్షల ఇన్సూరెన్స్ కల్పిస్తున్న ఏకైక సంఘం డీజేఎఫ్ అని, డిజేఎఫ్ సంఘం బలోపేతానికి, జర్నలిస్ట్ ల అభివృద్ధికి జిల్లా అధ్యక్షునిగా నా వంతు సహకారం అందిస్తానని గంధం రవికుమార్ తెలిపారు.





# పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రిన్సిపల్ ధనలక్ష్మికి సన్మానం

**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలో 1980లో స్థాపించబడిన హోలీ మదర్ కోఎడ్యుకేషన్ హై స్కూల్ ప్రిన్సిపల్ ఎన్. ధనలక్ష్మికి పూర్వ విద్యార్థులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సమక్షంలో ప్రిన్సిపల్ ధనలక్ష్మికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేస్తూ ఘనంగా సన్మానం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, గత 45 సంవత్సరాలుగా అనేక మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన పాఠశాల సేవలను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు.పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, తమను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గురువులను సన్మానించడం గర్వకారణమని, అందరూ కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. అనంతరం భోజన కార్యక్రమంలో అందరూ పాల్గొన్నారు.

# బీజేపీ నాయకులకు రాఖి కట్టిన శిల్పారెడ్డి



**నాచారం, తెలంగాణ ముచ్చట్లు :**

నాచారం లో రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్ప రెడ్డి నాచారం డివిజన్ బీజేపీ కుటుంబ సభ్యులకు రక్షా బంధన్ కార్యక్రమం లో భాగంగా అందరికి రాఖిలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రావినాయక్, జిల్లా నాయకులు రాగిరి మోహన్ రెడ్డి, మల్కా ప్రకాష్, అనితా పద్మారెడ్డి, రవికాంత్, పాదం వెంకటేష్, ఉదయ్ కిరణ్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సాయి గౌడ్, వెంకటేష్ గౌడ్, ఆనంద్ గుప్త, శ్రీనివాస్ యాదవ్, బాలు, అమర్, వరలక్ష్మి, జ్యోతి రెడ్డి, కల్పనా, డింపుల్, పవన్, కుశల్ వంశీ, హార్దిక్ వంశీ, సాయి, గౌతమ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పేకాటాతున్న పలువురు అరెస్ట్ కేసు నమోదు ..

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

వైరా మండలములోని సిరిపురం గ్రీన్ ఫీల్డ్ హైవే సమీపములోని డంపింగ్ యార్డ్ వద్ద పేకాట ఆడుతున్న 13మంది ని వైరా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ పుష్పాల రామారావు తెలిపారు. విశ్వసనియ సమాచారం మేరకు దాడులు చేయగా కె జి సిరిపురం, స్టేజ్ పినపాక కు చెందిన 13 మంది పై కేసు నమోదు చేసి వారి వద్ద 4250 నగదు, 5 బైక్స్, 2 స్కూటీ లను స్వాధీనం చేసుకున్నామని పంచనామా నిర్వహించి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.




# రైతు బీమాకు ఆగస్టు 13న ఆఖరి తేదీ..

- **తల్లాడ వ్యవసాయ అధికారి తాజుద్దీన్..**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఈనెల 13వ తేదీన రైతు బీమా దరఖాస్తుకు చివరి తేదీ అని, మండలంలో రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని తల్లాడ మండల వ్యవసాయ అధికారి ఎండి తాజుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కొత్త పట్టాదారు రైతులకు జూన్ 5 వరకు పట్టా పాస్ బుక్కు వచ్చిన వారికి ఇంతవరకు రైతు బీమా చేసుకొని రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, రైతు ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఆగస్టు 14, 1966 నుండి ఆగస్టు 14, 2007 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే ఈ రైతు బీమాకు అర్హులని పేర్కొన్నారు. మండలంలో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.





# రుద్రగోని వెంకటేష్ గౌడ్ కుమార్తె వివాహానికి హాజరైన ఎమ్మెల్యే

**చర్లపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

చర్లపల్లి డివిజన్ టిడిపి కార్పొరేటర్ అభ్యర్థి రుద్రగోని రాంచందర్ గౌడ్ సోదరుడు రుద్రగోని వెంకటేష్ గౌడ్ కుమార్తె ధరణి-సింహావర్ధన్‌ల వివాహం శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో జరిగింది.ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మల్లాపూర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పావనీరెడ్డి, సింగిరెడ్డి ధనిపాల్ రెడ్డి, టిడిపి నాయకులు అశోక్ కుమార్ గౌడ్, టిజికె మూర్తి నాయకులు తదితరులు హాజరయ్యారు.



# తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**హబ్సిగూడ, తెలంగాణ ముచ్చట్లు:**

హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8 లో బంజారా గిరిజన ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా తీజ్ పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు .ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజనులందరికి తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బంజారాల కట్టుబొట్టు సంస్కృతీ సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తున్నది గిరిజనుల ఆచారాలు, పండుగలు, సాంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి తెలంగాణాలో ప్రతి ఏడాది శ్రావణమాసంలో తీజ్ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. గిరిజన సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునే పండుగల్లో తీజ్‌కు ప్రత్యేక స్థానం ఉందని బంజారుల సంస్కృతిని కాపాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ గొప్పగా పూజించే గిరిజన సాంస్కృతిక పండగ తీజ్ ఉత్సవాల్లో పాల్గొనటం సంతోషంగా ఉంది అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షుడు గణేష్ నాయక్,

సీనియర్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి ,ఉప్పల్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకారం అరుణ్ పటేల్, ధర్మేందర్ నాయక్, రాజు నాయక్, కిషన్ నాయక్, రమేష్ నాయక్, మాలు నాయక్, వాసు నాయక్, శివ, చోటు, ప్రశాంత్ రెడ్డి,మరియు బంజారా సోదరులు పాల్గొన్నారు.

సోమవారం-11- ఆగస్టు 2025

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## కాంచీపురం కామాక్షి వెడ్డింగ్ సిల్క్ సెంటర్ ను ప్రారంభించిన ఈటెల

**హబ్సిగూడ , తెలంగాణ ముచ్చట్లు:**

హబ్సిగూడ లోని స్ట్రీట్ నెంబర్ 8 బృందావన కాలనీలో కాంచీపురం కామాక్షి వెడ్డింగ్ సిల్క్ సెంటర్ ను మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ హబ్సిగూడలో నాణ్యతతో కూడిన పట్టు వస్త్రాలను వినియోగదారులకు అందించేందుకు కాంచీపురం కామాక్షి సిల్క్స్ ను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. అనంతరం కంచిపురం కామాక్షి సిల్క్స్ యాజమాని ఆనంద్ మాట్లాడుతూ వినియోగదారుల ను దృష్టిలో ఉంచుకొని సరసమైన ధరల్లో అన్ని రకాల చీరలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ షాపులో 2000 నుంచి 1 లక్ష వరకు చీరలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.



## అనంతనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతిపత్రం

**మల్కాజ్గిరి, తెలంగాణ ముచ్చట్లు:**

మల్కాజ్గిరి నియోజకవర్గం వినాయక్‌నగర్ డివిజన్‌లోని అనంతనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, కాలనీలో నెలకొన్న డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యతో పాటు, వినాయక్‌నగర్ ఇండియన్ బజార్ (చైనా బజార్) సమీపంలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు.ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించి సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

కార్యక్రమంలో అనంతనగర్ కాలనీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, ప్రమోద్‌కుమార్, నరేష్, యాదగిరి, జయప్రకాష్, వినయ్‌కుమార్, దేవేందర్, యూనస్, ఆకాష్, సుకేష్, సురేష్, నవీన్, లక్ష్మణ్, దినేష్, నాగరాజు గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తులసి, సురేష్, బాలకృష్ణ, సంపత్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## భారత్‌లో టెస్లా బిగ్ డీల్!.. నెలకు రూ.17.22 లక్షల రెంట్

**ముంబై, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రపంచం కుబేరుడు 'ఎలాన్ మస్క్' యాజమాన్యంలోని ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం 'టెస్లా'.. ముంబైలో తన మొదటి షోరూమ్ ప్రారంభించింది. ఇప్పుడు తన రెండో షోరూంను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది.

తన రెండో షోరూమ్ కోసం టెస్లా ఇండియా మోటార్స్ అండ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఢిల్లీలోని ఏరోసిటీలో 8,200 చదరపు అడుగుల స్థలాన్ని తొమ్మిది సంవత్సరాలకు లీజుకు తీసుకుంది. దీని నెలవారీ అద్దె రూ. 17.22 లక్షలు. ఈ విషయాన్ని డాక్యుమెంట్‌స్‌ను అసెస్ చేసిన 'సీఆర్‌ఈ మ్యాట్రిక్స్' వెల్లడించింది.

టెస్లా ఈ స్థలాన్ని ఓక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి చదరపు అడుగుకు రూ. 210 చొప్పున.. రూ.1.03 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్‌తో లీజుకు తీసుకుంది. అంతే కాకుండా టెస్లా నెలకు రూ. 6,000 చొప్పున 10 పార్కింగ్ స్లాట్‌లను కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది.

జూలై 15, 2025న ప్రారంభమయ్యే లీజు మొదటి సంవత్సరానికి రూ. 40.17 లక్షలు, రెండవ సంవత్సరంలో రూ. 42.07 లక్షలు, మూడవ సంవత్సరంలో రూ. 44.07 లక్షలు, నాల్గవ సంవత్సరంలో రూ. 46.17 లక్షలు, ఐదవ సంవత్సరంలో రూ. 48.36 లక్షలు, ఆరవ సంవత్సరంలో రూ. 50.66 లక్షలు, ఏడవ సంవత్సరంలో రూ. 53.06 లక్షలు, ఎనిమిదవ సంవత్సరంలో రూ. 55.58 లక్షలు, తొమ్మిదవ సంవత్సరంలో రూ. 58.22 లక్షలకు చేరుకుంటుంది.

# ఎన్నికల కమిషన్ అక్రమాలపై కాంగ్రెస్ పవర్ పాయింట్ ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

తప్పుడు ఓట్లకు నిదర్శనమని పేర్కొన్నారు. మూడోసారి అధికారంలోకి రావడానికి మోదీ-అమిత్ షా ఎన్నికల కమిషన్‌ను వాడుకున్నారని, అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. గాంధీ కుటుంబం చేసిన త్యాగాల పై అవగాహన లేని వ్యక్తి దేశ ప్రధానిగా ఉండటం దురదృష్టకరమని అన్నారు.

కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎర్రబెల్లి స్వర్ణ, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్‌రావు, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్ బస్వరాజు శిరీష శ్రీమాన్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కుసుమ వరుణ్, కాంగ్రెస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన... రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



చావా శ్రీనివాసరావు జ్యోతి దంపతుల కుమారుడు సాయి సృజన్ వివాహం షర్మిల రాణి తో శుక్రవారం వివాహం నందిగామలో ఘనంగా జరిగింది. ఆదివారం శబరి గార్డెన్లో రిసెప్షన్ వేడుకలు నిర్వహించారు. రిసెప్షన్ వేడుకల్లో నవ దంపతులను అతిథులంతా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరు కుటుంబాలకు చెందిన చేకూరి వారి చావా వారి కుటుంబ సభ్యులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులను రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులకు పట్టు వస్త్రాలు సమర్పించి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు అనంతరం విచ్చేసిన అతిధులు నూతన వధూవరులు సాయి సృజన్ షర్మిల రాణి దంపతులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురలీకృష్ణ మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ రాష్ట్ర మార్క్ ఫైడ్ వైస్ చైర్మన్ బోర్ర రాజశేఖర్ మిట్టపల్లి నాగిదార్నా రాజశేఖర్ మాజీ ఎంపీపీ కట్టా కృష్ణా జిల్లా స్వరూప రాణి దంపతులు మాది నేని దుర్గాప్రసాద్ సునీత దంపతులు కోదండ రామాలయం మాజీ చైర్మన్ మిట్టపల్లి సత్యం బాబు చింతోజు నాగేశ్వరరావు చింతలపూడి వెంకటేశ్వరరావు చింత నిప్పు వెంకటయ్య పెనుగొండ ఉపేందర్ రావ్ మిట్టపల్లి శ్రీనివాసరావు జీవి కృష్ణారావు తాళ్లపల్లి కృష్ణ బండారుపల్లి రవి చెరుకూరి శ్రీనివాసరావు ఊరుకొండ వెంకటేశ్వరరావు వై బుచ్చి రామారావు చల్లా కృష్ణారావు నాళ్ళ నాగేశ్వర రావు చింతలపూడి వెంకటేశ్వరరావు గుంటి రవి వజినేపల్లి సునీత మిట్టపల్లి మహాలక్ష్మి అతిథులు బంధువులు బంధుమిత్రులు రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జిల్లా మీసేవ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక..

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**






రాష్ట్రవ్యాప్త మీసేవ నిర్వాహకులకు త్వరలో వెల్ఫేర్ బోర్డు అమలు కానుందని టీజీఎమ్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్ అన్నారు. స్థానిక ఖమ్మంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్ లో ఖమ్మం జిల్లా మీసేవ నిర్వాహకుల ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షులు కామిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి మీసేవ ఆపరేటర్లు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం కమిషన్ పెంచేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో మీ సేవ ఆపరేటర్ల పై దాడులకు పాల్పడ్డారని ఈ విషయాన్ని సంఘం ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళగా దాడులకు పాల్పడ్డ వారిని బి ఎన్ఎస్ చట్టప్రకారం చర్యలకు ఒక చట్టం రూపొందించిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎండి మోయిద్ మాట్లాడుతూ ఇటీవల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాల వల్ల పెండింగ్ సమస్యలకు పరిష్కారం దొరికిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లీగల్ సెల్ కన్వీనర్ రాయల ఉదయ్ కుమార్ మరియు బూరుగు ముఖేష్ పాల్గొన్నారు.

**జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక:**

ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా మీ సేవ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కామిశెట్టి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగా జాజం శ్రీనివాసరావు గౌరవ అధ్యక్షులుగా కుర్ర అనిల్ కుమార్ కోశాధికారిగా ఎండి బహదూర్ ఉపాధ్యక్షులుగా రామిని వెంకటేశ్వర్ రెడ్డి పుచ్చకాయల అచ్యుతరావు తూమాటి మధు , యరమల శ్రీనివాసరెడ్డి జాయింట్ సెక్రటరీగా నల్లపరెడ్డి శిరీష వేణుగోపాల్ రెడ్డి , గద్దె సౌమ్యా వినయ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిర్రా నాగయ్య, కొనతం కాలేశ్వర్ రెడ్డి వేములపల్లి అశోక్ గౌరవ సలహాదారులుగా సీతయ్య, ఆనంద్ పాల్గొన్నారు. అనంతరము నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకుల ఘనంగా సత్కరించారు.





## వైరాలో ఇసుక లారీ పట్టివేత..

- ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు..
- వైరా ఎస్సై పుష్పాల రామారావు..

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్ర నుండి రవాణా చేస్తూన్న ఇసుక లారీ ని వైరా పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పట్టణ ఎస్ ఐ పుష్పాల రామారావు కథనం ప్రకారం వాహనాలు తనిఖీ చేస్తుండగా తల్లాడ వైపు నుండి వైరా వైపు వస్తున్న ఏపీ 27 టీజెడ్ 2497 లారీని తనిఖీ చేయగా ఇసుక లోడ్ ఉండగా ఎటువంటి అనుమతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడముతో వాహనమును స్వాధీనం చేసుకొని వాహన డ్రైవర్ బాల కృష్ణ, యజమాని వెంకటేశ్వర రావు, ఇట్టి రవాణాకు సహకరిస్తున్న వైరాకు చెందిన బానోత్ కృష్ణ ల పై కేసు నమోదుచేసుకొని దర్యాప్తు జరుపున్నాము. ఈ సందర్భంగా వైరా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమముగా ఆంధ్ర నుండి ఇసుక రవాణా జరిపితే వాహనాలు సెజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# విచక్షణ మరిచిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తన మాట వినని దేశాలపై తోచిన మోతాదులో సుంకాలు వేయటం నిత్యకృత్యమైంది. ఈ క్రమంలో న్యాయం, ధర్మం, విచక్షణ, హేతుబద్ధత వగైరాలు లేవు. రెండోసారి దేశాధ్యక్షుడైనా తమ దేశం ఎవరెవరితో ఏ స్థాయి వాణిజ్యం నెరపుతున్నదో తెలియని ట్రంప్... వేరే దేశాలు ఎవరితో ఎలాంటి సంబంధాలు నెలకొల్పుకోవాలో, వద్దో నిర్ణయించటానికి తగుదునమ్మా అంటూ తయారయ్యారు.



ఈనెల 1 నుంచి మన దేశంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు లోగడ ప్రకటించిన ట్రంప్, వారం తిరగకుండానే మరో 25 శాతం మేర సుంకాలుంటాయని తాజాగా నిర్ణయించారు. ఇవిగాక పరోక్ష సుంకాలు మొదలవు తాయట. ఇవన్నీ 250 శాతం దాటినా దాటొచ్చని లోగడే ఆయన సెలవిచ్చారు. తన మాట నెగ్గటానికి కనిపించిందల్లా విసిరికొట్టే అల్లరిపిల్లల మొండిధోరణికీ, ట్రంప్ చేష్టలకూ తేడా ఉందా? తనకు రష్యా నచ్చలేదు గనుక ఆ దేశం నుంచి ముడి చమురు కొనరాదని ఆయన శాసిస్తున్నారు. ఉక్రెయిన్‌తో జగడం ఆపేయాలని పదే పదే కోరుతున్నా వినని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అక్కసుతో ఇవన్నీ చేస్తున్నట్టు అందరికీ కనబడుతోంది. కానీ అసలు కారణాలు వేరు. నిజానికి రష్యా చమురు కొని ప్రపంచమార్కెట్లు స్థిరంగా ఉండేలా చూడమని గతంలో చెప్పింది అమెరికాయే!

ప్రేమాభిమానాలను అపాత్రదానం చేయకూడదు. ట్రంప్ వ్యవహారశైలి చూచాయగా తెలుస్తున్నా, తొలి దఫాలో ప్రధాని నరేంద్ర మోదీ ఆయన పట్ల సానుకూలంగా ఉన్నారు. దేశాల మధ్య సుహృద్భావ సంబంధాలకు సానుకూలత అవసరమే. కానీ దానికి కూడా అవధులుంటాయి. 2019 సెప్టెంబర్‌లో అమెరికాలోని టెక్సాస్‌లో 'హౌడీ మోదీ' కార్యక్రమమైనా,ఆ మరుసటేడాది ట్రంప్ భారత్ సందర్శించినప్పుడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 'నమస్తే ట్రంప్' అయినా దౌత్య పరిమితులు దాటాయన్న విమర్శలు వచ్చాయి.

ప్రభుత్వం సంగతి సరే... పౌరులు కూడా ఆ మాదిరే ఉన్నారు. అమెరికాలోని కొందరు ఎన్నారైలు ఆయన దేశాధ్యక్షుడు కావాలని యజ్ఞయాగాదులు చేశారు. అంతేకాదు... ప్యూ రీసెర్చ్ సంస్థ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక ప్రపంచ వ్యవహారాల్లో ట్రంప్ వ్యవహారశైలిపై 24 దేశాల్లో 28,333 మందిని సర్వే చేస్తే సగం మంది భారతీయులు ఆయనపై విశ్వాసం వ్యక్తపరిచారట. ఆ సంగతి అప్పట్లో ఆ సంస్థ ప్రకటించింది. టర్కీ, జర్మనీ, మెక్సికో లాంటి దేశాల్లో మాత్రం అత్యధికులు (80 శాతం పైగా) ట్రంప్‌పై నమ్మకం లేదని తెలిపారు. ఈ ఫలితాల్లో మనం హంగేరి, ఇజ్రాయెల్, నైజీరియా, కెన్యాల సరసన చేరాం.

అయితే ట్రంప్ వికృత విన్యాసాలు గమనించాక మోదీ ఆయన విషయంలో దృఢవైఖరి ప్రదర్శిస్తున్నారు. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి అన్నదాతల, మత్స్యకారుల ప్రయోజనాలను విస్మరించే ప్రశ్నే లేదని గురువారం ఆయన మరోసారి కుండబద్దలు కొట్టారు. ఇందుకు వ్యక్తిగతంగా మూల్యం చెల్లించాల్సి వచ్చినా సిద్ధమేనన్నారు. మోదీ, ట్రంప్‌ల మైత్రి గురించి ఉన్న అభిప్రాయంతో సుంకాల ఒప్పందంలో అమెరికాదే పైచేయి అవుతుందనుకున్న మన విపక్షాలకు ఇది నిరాశ కలిగించే పరిణామమే.

దేశంలో 70 కోట్లమంది ప్రజానీకం ఆధారపడి బతికే రంగాలను విదేశాలకు గంపగుత్తగా అప్పగించే దుస్సాహసం ఎవరైనా చేయగలుగుతారా? పైగా అవి జన్యుమార్పిడి చేసినవి. ఆ చెత్త మన మార్కెట్లను ముంచెత్తితే కలిగే దుష్పరిణామాల గురించి చాన్నాళ్లుగా పర్యావరణవాదులు చెబుతూ వచ్చారు. తమ సాగు, పాడి ఉత్పత్తులపై అసలు సుంకాలే విధించరాదన్నది ట్రంప్ ఆంతర్యం.

ఆశపడటం సహజం... కానీ అది దురాశగా మార రాదని ఆయన గారికి చెప్పేదెవరు? 'జీరో' సుంకాల సంగతి బహిరంగంగా చెబితే నలుగురూ నోళ్లు నొక్కుకుంటారని ట్రంప్ భయపడి రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపుతూ, రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు ఆపాలన్న రాగం అందుకున్నారు. ఏ సరుకు ధరైనా మార్కెట్ శక్తులు నిర్ణయించే వర్తమానంలో రష్యా నుంచి చవగ్గా కొనరాదని, దాన్ని హెచ్చు ధరకు అమ్మ రాదని ఆంక్షలు విధించాలని చూడటం ట్రంప్ తెలివితక్కువతనం. అమెరికా ఇన్నాళ్లూ ప్రవచించిన ప్రపంచీకరణకు వ్యతిరేకం. పైగా చైనాతో పోలిస్తే మన ముడిచమురు కొనుగోళ్లు తక్కువ. అయినా ఆ దేశంపై ట్రంప్ సానుకూలంగా ఉన్నారు.

ట్రంప్ పాత, కొత్త సుంకాలు అమలైతే భారత్ జీడీపీపై 0.6 శాతం ప్రభావం పడుతుందని ప్రముఖ మదుపు సంస్థ గోల్డ్‌మాన్ శాక్స్ ప్రకటించింది. ఇదిగాక వాణిజ్య అనిశ్చితి వల్ల పరోక్ష ప్రభావం ఉండొచ్చని ఆ సంస్థ చెబుతోంది. మొత్తానికి ట్రంప్ ఇదే మంకుపట్టుతో ఉంటే మనకు ఏదోమేర సమస్యలుండక తప్పదు. ఈ వైరం మనం కోరుకున్నది కాదు. అయినా వచ్చి పడింది. కనుక కలిసికట్టుగా ఉండి ఎదుర్కొనటమే ఏకైక మార్గం.

# సకల జనుల తెలంగాణలో వివక్షలేల?

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అర్పించిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్. ముల్కీ ఉద్యమం మొదలుకొని మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు అన్ని దశల్లోనూ ఆయన ఉద్విగ్నంగా భాగస్వాములయ్యారు. 'ప్రజలకు తమ కష్టాలకు సంబంధించిన అనుభవాలు ఉంటాయి కానీ, కారణాలు తెలియవు. వాటిని తెలియజేసే కర్తవ్యం బుద్ధిజీవులదే'నని జయశంకర్ సార్ నిశ్చితాభిప్రాయం. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను పూసగుచ్చినట్టు వివరించే బాధ్యతను జయశంకర్ సార్ ఒక పవిత్ర కర్తవ్యంగా స్వీకరించారు. రెండు భిన్న చారిత్రక దశలను కలిగి ఉన్న ప్రాంతాలను కలపటం వల్ల జరిగిన అనర్థాన్ని, ఆంధ్ర వలస వాదానికి తెలంగాణ బలైపోయిన తీరును ఆయన ఆధారాలతో సహా నిత్యం రికార్డు చేస్తూ వచ్చిండ్రు. ప్రాంతీయ అసమానతల అధ్యయనానికి ఆయన నూతన ఒరవడి దిద్దిండ్రు. కేసీఆర్‌కు వెన్నంటి ఉంటూ తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కు మద్దతుగా దేశవ్యాప్తంగా రాజకీయ పక్షాల నుంచి ఆమోద లేఖలను సంపాదించడం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. భావజాల రంగంలో జయశంకర్ సార్ చేసిన కృషి వల్లనే సమైక్యవాదం నిలబడలేకపోయింది. జయశంకర్ సార్ రచనలు ఉద్యమకారులకు గొప్ప ఆయుధాలైనయి. తెలంగాణ ఎల్లెడలా పర్యటిస్తూ ఉద్యమకారులకు నైతిక ఆత్మస్థైర్యాన్ని అందించారు. భిన్న భాషలు, కులాలు, మతాల ప్రజలు సామరస్యంగా జీవించే సంపద్వంతమైన తెలంగాణ సంస్కృతికి ప్రతీక జయశంకర్ సార్. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో పాండిత్యం కలిగిన ప్రతిభామూర్తి. ఒక మతానికి ఒక భాష ఉండవచ్చును కానీ, భాషకు మతం ఉండదని ఆయన పదే పదే చెప్పేవారు. హిందూస్థానీ భాషగా ఉర్దూ పట్ల ఆయనకు అమితమైన గౌరవం, అభిమానం ఉండేది. ఉపన్యాసాల్లో మిర్జా గాలిబ్, సాహిర్ లూధియాన్వీ, మగ్దూం మొహియుద్దీన్ వంటి ఉర్దూ కవుల కవిత్వ పంక్తులను ఆయన విరివిగా ఉటంకించేవారు. స్ఫుటమైన తెలుగులో ఎంత గొప్పగా ఉపన్యాసం చెప్పేవారో ఫసీ ఉర్దూలో అంతే గొప్పగా ఉపన్యసించేవారు. 'నా ఆలోచన మొదట ఉర్దూలో సాగుతుంది. ఆ తర్వాత సమానార్థకాలైన తెలుగు లేదా ఆంగ్ల పదాలను నేను ఎంచుకుంటా'నని ఆయన చెప్పేవారు.

అయితే, ప్రజాకవి కాళోజీ, ఆచార్య జయశంకర్ వంటి పెద్దలు నెలకొల్పిన మత సామరస్య విలువలను మంటగలిపే ప్రయత్నం మన తెలంగాణలో పెచ్చరిల్లడం విషాదం. జయశంకర్ సార్ స్ఫూర్తితో ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు బుద్ధిజీవులను సమాయత్తం చేసే ప్రయత్నం చేస్తున్నది తెలంగాణ వికాస సమితి.

ఓం సహనా వవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వినా వధీతమస్తు మావిద్విషావహై ఓం శాంతిః శాంతిః శాంతిః ఒకరినొకరు ద్వేషించకుండా కలిసి జీవించాలని, కలిసి పంచుకోవాలని, కలిసి విశ్వశాంతికై పాటుపడాలని శాంతి మంత్రాన్ని ప్రవచించిన నేల మన భారతదేశం. భారతీయ ఆధ్యాత్మిక తేజోమూర్తిగా విలసిల్లిన స్వామి వివేకానంద చికాగోలో సర్వమత సమ్మేళనంలో తన ఉపన్యాసాన్ని ప్రారంభిస్తూ 'భారతీయులమైన మేము సర్వమత సహనాన్నే కాక సర్వమతాలు సమానమని విశ్వసిస్తాం. సమస్త దేశాల నుంచి పరపీడితులై, శరణాగతులై వచ్చిన వారికి శరణమిచ్చిన దేశం నా దేశమని గర్విస్తున్నాను. రోమన్ల నిరంకుశత్వానికి గురై దక్షిణ భారతానికి వచ్చి శరణు పొందిన యూదులను, జొరాష్ట్రీయ సంఘంలో మిగిలిన పారశీకులను కౌగిట చేర్చుకొని ఆదరించిన నా ధర్మాన్ని చూసి గర్విస్తున్నాను. ఆకాశాత్పతితం తోయం, యథా గచ్ఛతి సాగరం, సర్వ దేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి.. వివిధ ప్రదేశాల్లో జన్మించిన నదులు సముద్రంలో కలసినట్లే, వివిధ భావాలచే మనుషులు అవలంబించే వివిధ ఆరాధనా మార్గాలు వేరువేరుగా కనపడినా, సర్వేశ్వరా, నిన్నే చేరుతున్నవి' అని పేర్కొన్నారు. జాతీయోద్యమ కాలంలో 'ఈశ్వర్ అల్లా తేరేనామ్.. సబ్ కో సన్మతి దేభగవాన్' అని మహాత్మాగాంధీ ప్రబోధించిన సర్వమత సమానత్వ సందేశం జాతి జనులను ఒక్కతాటిపై నడిపించింది. ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించింది. సమతామూర్తి భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ మన రాజ్యాంగాన్ని శాంతి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆధునిక విలువలకు ప్రతిబింబంగా తీర్చిదిద్దారు. భారత రాజ్యాంగం అన్ని మతాలకు, సంస్కృతులకు సమాన హక్కులను, గౌరవాన్ని ప్రమాణం చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మనం జరిపిన పోరాటం సైతం సకల జనుల స్ఫూర్తిని చాటింది. మనం చేసిన సమ్మె సకల జనుల సమ్మె. అంతేకానీ అది ఒక మతానికో, కులానికో చెందిన సమ్మె కాదు. వివక్షకు వ్యతిరేకంగా పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఏ వర్గం పట్ల, ఏ మతం పట్ల వివక్ష ఉండకూడదు. ప్రభుత్వాలు ఏవైనా అన్ని వర్గాలు, మతాలు, కులాల ప్రజలను విశ్వాసంలోకి తీసుకుంటూ, అందరినీ ఒక్కటిగా నిలుపుతూ శాంతి సామరస్యాలను కాపాడుతూ తెలంగాణను ప్రగతి పథంలో నడిపించాలి. భూస్వామ్య పీడనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించి ఒక మతఘర్షణ స్థాయికి కుదించిన సినిమాకు ప్రస్తుత ప్రభుత్వం గద్దర్ అవార్డును ప్రకటించింది. ఇది గద్దర్ పాటించిన విలువలకు, తెలంగాణ గంగాజమునా తెహజీబ్‌కు విఘాతం కలిగించిన ప్రతీఘాతుక చర్య. 'జై తెలంగాణ' నినాదాన్ని మసకబార్చటం కూడా తీవ్ర అభ్యంతరకర చర్యగా భావిస్తున్నాం. తెలంగాణలో వందల సంవత్సరాలుగా నెలకొన్న గంగాజమునా తెహజీబ్‌ను కాపాడుకోవటం కోసం తెలంగాణ వికాస సమితి ఈనెల 9న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి సభను నిర్వహిస్తున్నది. ఈ సభలో ప్రముఖ సినీనటులు ప్రకాశ్‌రాజ్ 'వైషమ్యాల సుడిలో వైవిధ్య భారతం' అనే అంశంపై ఆచార్య జయశంకర్ స్మారకోపన్యాసం చేస్తారు. ప్రొఫెసర్ హరగోపాల్ విశిష్ట అతిథిగా పాల్గొంటారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ వి.ఎస్.ప్రసాద్, విఖ్యాత నవలా రచయిత అంపశయ్య నవీన్, ప్రముఖ ఇంజినీరు, సామాజికవేత్త శ్రీధర్‌రావు దేశ్‌పాండేలకు గౌరవ పురస్కారాలు అందజేస్తున్నాం. ప్రజాస్వామిక వాదులందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.

# ఆటలో గెలవాలంటే ఆడితీరాలి

ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలలో పాల్గొనడమనేది పౌరుల హక్కే కాదు, బాధ్యత కూడా. ప్రజలు ఆ హక్కును సద్వినియోగపరిచి, తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చేలా చూడడమనేది రాజకీయ పార్టీల, ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీల విద్యుక్త ధర్మం. అయినా కొన్ని రాజకీయ పార్టీలు లేదా ప్రజా వర్గాలు అప్పుడప్పుడూ ఎన్నికలలో పాల్గొనేందుకు నిరాకరించడం, ఆ ప్రజాస్వామిక ప్రక్రియను బహిష్కరించడం జరుగుతోంది. తద్వారా, ఎన్నికలలో పాల్గొనడం కంటే పాల్గొనకపోవడం ద్వారా ప్రభుత్వానికి, సమాజానికి తమ వైఖరి ఏమిటో స్పష్టాతి స్పష్టంగా చెప్పడమవుతుందని పార్టీలు లేదా ప్రజా వర్గాలు భావిస్తున్నాయి. పార్టీలు లేదా ప్రజావర్గాలు ఎన్నికలను బహిష్కరించడమనే ఎత్తుగడ పాత, కొత్త ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పునరావృతమవుతున్న లక్షణంగా ఉన్నది. అయితే చరిత్ర ఈ పరిణామం గురించి ఒక సత్యాన్ని చెప్తుతోంది: ఎన్నికల బహిష్కరణలు అరుదుగా విజయవంతమయ్యాయి. అవి చాలావరకు విఫలమయ్యాయని, ప్రతిపక్షాలను బలహీనపరిచాయని, అధికారంలో ఉన్న పార్టీలు లేదా నాయకులకే మరింత అనుకూల పరిస్థితులు సృష్టించాయని కూడా చరిత్ర స్పష్టం చేసింది.



ఈ సంవత్సరాంతంలో బిహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలను బహిష్కరించాలని ప్రతిపక్షాలు గట్టిగా పిలుపునిస్తున్నాయి. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ %%సర్) పట్ల సందేహాలు, సంకోచాలతో విపక్షాలు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించేందుకు సమాయత్తమవుతున్నాయి. ఓటర్ల పేర్లను భారీ ఎత్తున జాబితా నుంచి తొలగించే లక్ష్యంతోనే 'సర్'ను చేట్టారని, దీనివల్ల పేదలు, మైనారిటీలు, వలసపోయినవారు తీవ్రంగా నష్టపోనున్నారని 'సర్' విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో సర్ నిష్పాక్షికతను ప్రజలు విశ్వసించలేకపోతున్నారు.

ఎన్నికల సంఘం పట్ల బిహార్ ప్రజల్లో అపనమ్మకం నెలకొన్నది. ఓటర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం తక్షణమే ఎటువంటి సందేహాలకు తావివ్వని రీతిలో సమాధానాలు ఇవ్వవలసిన అవసరమున్నది. అయితే ఇదే సమయంలో సర్ పట్ల ఆక్షేపణతో ఎన్నికలను బహిష్కరించడం ఎంతవరకు సబబు అనే విషయాన్ని నిశితంగా పరీక్షించవలసిన అవసరమున్నది. ఎన్నికల బహిష్కరణ విషయమై చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని దక్షిణాసియా అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) 2014లో పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించింది. అధికారంలో ఉన్న అవామీలీగ్ రాజీనామా చేసి, ఎన్నికల నిర్వహణకు ఒక తటస్థ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించాలని బీఎన్‌పీ డిమాండ్ చేసింది. అవామీలీగ్ నిష్పాక్షికత పట్ల బీఎన్‌పీ అనుమానాలు నిరాధారమైనవి కావు. అయితే బీఎన్‌పీ ఎన్నికలను బహిష్కరించడం ద్వారా అధికార పార్టీకి చెప్పుకోదగ్గ పోటీ లేకుండా చేసింది. ఫలితంగా 153 నియోజకవర్గాలలో అవామీలీగ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల అనంతరం నేను ఢాకాకు వెళ్లాను. బీఎన్‌పీ ఎన్నికలలో పోటీ చేసి ఉంటే తప్పకుండా గెలిచేదని చాలా మంది నాకు స్పష్టంగా చెప్పారు అధికార అవామీలీగ్‌కు విజయాన్ని బీఎన్‌పీ స్వయంగా సమకూర్చిందని వారు అభిప్రాయపడ్డారు. భారత్‌లో కూడా ఎన్నికల బహిష్కరణ జరిగింది. పంజాబ్‌లో 1992 అసెంబ్లీ ఎన్నికలు ఇందుకొక ఉదాహరణ. శిరోమణి అకాలీదళ్ ఆ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించింది. ఫలితంగా ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదయింది. కొన్ని జిల్లాల్లో కేవలం 13 శాతం ఓటర్లు మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. అకాలీదళ్ బాయ్‌కాట్ కాంగ్రెస్ పార్టీకి సులభ విజయాన్ని సమకూర్చింది. పోటీ రహితంగా ఎన్నికలు జరగడం, శాసనసభలో ప్రతిపక్షం లేకపోవడంతో పంజాబ్‌లో ప్రజాస్వామ్యం సార్థకత కోల్పోయింది. ఇంకా పలు బహిష్కరణల ఉదంతాలు ఉన్నాయి. అయితే వాటిలో చాలా భాగం ప్రధానస్రవంతిలో లేని వేర్పాటువాద పార్టీలు ఇచ్చినవే. జమ్మూ కశ్మీర్ వేర్పాటువాద గ్రూపులు మొదటి నుంచీ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తూనే ఉన్నాయి.

ఎన్నికలలో తాము పాల్గొనడం జరిగితే కశ్మీర్‌లో భారత పరిపాలనకు న్యాయసమ్మతి కల్పించడమే అవుతుందని వేర్పాటువాదులు తమ నిర్ణయాన్ని సమర్థించుకునేవారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో కూడా ఎన్నికల బహిష్కరణ పిలుపులు విజయవంతమవలేదు. వెనిజులా ఇందుకొక ఉదాహరణ. 2005లో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించాయి. ఫలితంగా జాతీయ అసెంబ్లీలో ప్రతి సీటునూ పాలక కూటమి గెలుచుకున్నది. 2018లో పాక్షికంగా బహిష్కరించాయి. నికోలస్ మదురో మళ్లీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యేందుకు ఈ బహిష్కరణ తోడ్పడిరది. 2020లో కూడా ప్రతిపక్షాలు ఎన్నికలలో పాల్గొనకపోవడంతో 31 శాతం ఓటర్లే పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ తక్కువ శాతం పోలింగ్‌తో అధికార పార్టీకి భారీ మెజారిటీ లభించింది. జింబాబ్వేలో మోర్గాన్ స్వాన్‌గిరాయి 2008 అధ్యక్ష ఎన్నికల నుంచి ఉపసంహరించుకున్నారు. దీంతో రాబర్ట్ ముగాబే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల బహిష్కరణ వల్ల గానీ లేదా ఓటర్లు చాలా తక్కువగా పోలింగ్‌లో పాల్గొన్న కారణాన గానీ సంబంధిత ఎన్నికను రద్దు చేసే సౌలభ్యాన్ని భారత రాజ్యాంగం కల్పించలేదు. షెడ్యూలు ప్రకారం ఎన్నికల సంఘం విధిగా ఎన్నికలు నిర్వహించి, పోలయిన ఓట్ల ప్రాతిపదికన విజేతలు ఎవరో ప్రకటిస్తుంది. కనుక ఎన్నికల బహిష్కరణ పిలుపు ఎన్నికల ప్రక్రియను నిరోధించలేదు, నిరోధించజాలదు. పార్టీలు లేదా అభ్యర్థులు పోటీనుంచి వైదొలిగిన పక్షంలో అది బరిలో ఉన్న అభ్యర్థికి సులభ విజయం సమకూర్చడానికి మాత్రమే దోహదం చేస్తుంది. ఈ కారణంగానే బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివాదానికి ప్రతిస్పందనగా ఎన్నికలను బహిష్కరించాలన్న తమ పిలుపుపై ఆ రాష్ట్రంలోని ప్రతిపక్షాలు పునరాలోచన చేయవలసిన అవసరమున్నది. అయితే 'సర్' ప్రక్రియను నిశితంగా పరీక్షించాలి. ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు, పౌర సమాజం వ్యక్తం చేస్తున్న అనుమానాలను తొలగించాలి. ఆ సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానికి ఉన్నది. ఓటర్ల ఫిర్యాదులను శీఘ్రగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు అన్నీ చేపట్టాలి. పౌర సమాజం, మీడియా, న్యాయస్థానాలు అన్నీ 'సర్' విషయంలో జాగరూకతతో ఉండాలి. ఎన్నికలలో పాల్గొనే బాధ్యతను రాజకీయ పార్టీలు ఎట్టి పరిస్థితులలోను వదిలివేయకూడదు. ఎన్నికల బరి నుంచి వైదొలగడమంటే ఎన్నికల పోరులో ఓడిపోవడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలలో పాల్గొనక పోవడం నిరసన ఎంత మాత్రంకాదు, అది బాధ్యతను పరిత్యజించడమే అవుతుందన్న సత్యాన్ని విస్మరించకూడదు. ఎన్నికల బహిష్కరణే కాదు, పార్లమెంటు సమావేశాలను బహిష్కరించడం కూడా ప్రతిపక్షాలు తమను తాము ఓడిరచుకోవడమే అవుతుంది. వాకౌట్‌లు, సభా కార్యక్రమాలకు ఎగతెగకుండా అంతరాయం కలిగించడం కొన్ని సందర్భాలలో ప్రతీకాత్మక నిరసన కావచ్చునేమో కానీ, వాటి ఆచరణాత్మక ప్రభావం వల్ల కీలక బిల్లులను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించే స్వేచ్ఛ పాలక పక్షానికి లభిస్తుంది. అనేక కీలక బిల్లులు 2020లో మూడు కొత్త సాగు చట్టాలు, అంతకు ముందు సంవత్సరాలలో కీలక రాజ్యాంగ సవరణలు ప్రతిపక్ష ఎంపీల వాకౌట్ల వల్లే ఆమోదించడం అధికార పార్టీకి వీలయింది.

ఎన్నికలలో గానీ, పార్లమెంటులో గానీ ప్రతిపక్షం పాత్ర ప్రభుత్వాన్ని సవాల్ చేయడం, ప్రశ్నించడం, పాలనాపరమైన నిర్ణయాలు, చర్యలకు జవాబుదారీగా వ్యవహరించేలా చేయడమే. ఆగ్రహాన్ని, అసంతృప్తినీ వ్యక్తం చేసేందుకు బహిష్కరణలు ఉపయోగపడవచ్చుగానీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వేదికల నుంచి వైదొలగడం, పాలకులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించేలా చేయాల్సిన పోరాటాలను వదిలివేయడమే అవుతుంది. అత్యంత ప్రభావశీల ప్రతిపక్ష నాయకులు అందరూ అత్యంత ప్రతికూల పరిస్థితులలోను తమ బాధ్యతలను విడనాడనివారేనని చరిత్ర చెప్తుతోంది. ప్రజాస్వామిక పద్ధతులలో ప్రభుత్వ తప్పులను బహిర్గతం చేసి, ప్రజాభిప్రాయాన్ని సమీకరించి, ప్రజల విశ్వాసాన్ని పొందినవారేనని స్పష్టం చేస్తోంది. ఎన్నికలు, పార్లమెంటు సమావేశాలను బహిష్కరించడం వల్ల ప్రతిపక్షాలు తమ ప్రత్యర్థులకే అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఇది చాలా పెద్ద తప్పు. దీనివల్ల సంభవించే అనర్థాల నుంచి కోలుకోవడానికి దశాబ్దాలు కాకపోయినా సంవత్సరాలు పడుతుంది. చట్టసభలలో ప్రతిపక్షాల స్థానాలు ఖాళీగా ఉండడం అధికారపక్షం స్వప్నం, ప్రజాస్వామ్యానికి దుస్స్వప్నం అనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## కాల్చిన కొబ్బరి బోండాల నీళ్లు తాగారా?

కొబ్బరి బోండాల నీరు ప్రకృతి ఇచ్చిన అమృతం లాంటి పానీయం. కొబ్బరి నీళ్లలో పోషకాలు ఉంటాయని అందరికీ తెలిసిందే. అలాంటి కొబ్బరి బోండాల నీళ్లు చల్లగా, లేదా నార్మల్‌గా ఉన్నవి మాత్రమే తాగడం చూసి ఉంటారు.కానీ అందుకు భిన్నంగా కొబ్బరి బోండాలు కాల్చి కూడా అమ్ముతున్నారు. తాజాగా దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే కొబ్బరి బోండాలు ముందుగా బట్టీలో కాల్చిన తర్వాత పైన ఉన్న భాగాన్ని తీసేసి వేడి వేడి కొబ్బరి నీళ్లు, లోపల ఉన్న వేడి కొబ్బరిని ఇస్తున్నారు. కస్టమర్లు సైతం అలాగే ఊదుకుంటూ నీళ్లు తాగుతున్నారు.. కొబ్బరిని తింటున్నారు. కొబ్బరి బోండాల నీళ్లు ఇలా కూడా తాగుతారా? ఇలా తాగడం వల్ల ఏం బెనిఫిట్స్ ఉంటాయని నెటిజన్లకు అనుమానం వచ్చింది. అయితే వేడి కొబ్బరి నీటిని తాగడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణుల వాదన. గోరువెచ్చగా కొబ్బరి నీరు సేవించినప్పుడు జీర్ణవ్యవస్థకు సహాయపడుతుందని చెబుతున్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వేడి కొబ్బరి నీరు తాగడం వల్ల క్యాన్సర్ నయం అవుతుందనే ప్రచారం ఉంది. కానీ అది ఇంకా సైంటిఫిక్‌గా ప్రూవ్ కాలేదని డాక్టర్లు చెబుతున్నారు.

# గర్భధారణ సమయంలో ఆ తప్పు చేస్తే.. పుట్టబోయే పిల్లలపై ప్రభావం పడేచాన్స్!

గర్భధారణ సమయంలో స్త్రీలు చేసే కొన్ని పొరపాట్లు లేదా తప్పులు పుట్టబోయే పిల్లలపై చూపుతాయని నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా తల్లులు సరైన పోషకాహారం తీసుకోకపోతే వారికి జన్మించిన పిల్లలు పెద్దయ్యాక కూడా ఆ ఎఫెక్ట్ ఉంటుందని, ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చునని అంటున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా గర్భిణుల్లో పోషణలేమి సమస్య ఉంటోంది. పిండం ఎదుగుతున్న క్రమంలో తగిన పోషకాలు కలిగిన ఆహారం అందని పరిస్థితిని చాలామంది ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా గర్భధారణ సమయంలో ఫైబర్ కంటెంట్ ఉన్న పదార్థాలు తీసుకోకపోతే బ్రెయిన్ ఎదుగుదలపై ప్రభావం పడవచ్చునని జంతువులపై నిర్వహించిన అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అచ్చం మనుషుల్లోనూ అదే జరుగుతుందని జపాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ యమనషికి చెందిన పరిశోధకుల అధ్యయనంలోనూ వెల్లడైంది. గర్భధారణ సమయంలో పోషణలేమికి, పిల్లల్లో మెదడు ఎదుగుదల లోపాలకు సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అధ్యయనంలో



భాగంగా ప్రెగ్నెన్సీ టైమ్‌లో తగినంత పీచు పదార్థాలు తిన్నవారికి జన్మించిన పిల్లలను, అలాగే వాటిని చాలా తక్కువగా తిన్నవారికి జన్మించిన పిల్లలను పరిశీలించగా, పీచు తక్కువగా తిన్నవారి పిల్లల మెదడు భాగంలోని నాడుల్లో డెవలప్‌మెంట్ మందగించినట్లు తేలింది. అలాగే పర్సనల్ అండ్ సోషల్ స్కిల్స్ కూడా ఫైబర్ కంటెంట్ తక్కుగా ఉన్న పిల్లల్లో తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. ఎదుగుదల విషయానికి వస్తే శరీరంలోని చిన్న కండరాల సమన్వయంతో పాటు వివిధ అవయవ భాగాల కదలికలు, సమన్వయం వంటివి ఆలస్యమైనట్లు పరిశోధకులు కనుగొన్నారు. అందుకే గర్భధారణ సమయంలో సమతుల్య పోషకాహారం అవసరమని, దీనిపై ఆయా దేశాలు కూడా మార్గదర్శకాలు కలిగి ఉండాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

## గొంతు సమస్యలు చిటికెలో తగ్గే టిప్స్?

వేసవి కాలంలో గొంతులో ఇన్ఫెక్షన్ వచ్చి దగ్గు ఇంకా అలాగే టాన్సిల్స్ వంటి సమస్యలు కూడా ఎక్కువగా వస్తాయని, దీని వల్ల నీరు తాగడానికి, మింగడానికి చాలా రకాలుగా ఇబ్బందిగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో మార్పులు సంభవించినప్పుడల్లా దగ్గు, జ్వరం, కడుపు నొప్పి ఇంకా గొంతునొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యలు చాలా సాధారణం. ఇక మారుతున్న వాతావరణం వల్ల ప్రతిసారి పలకరించే సమస్యల్లో అతిపెద్ద సమస్య ఏంటంటే గొంతు ఇన్ఫెక్షన్.ఇక మీరు కూడా గొంతు ఇన్ఫెక్షన్‌తో ఎక్కువగా ఇబ్బంది పడుతుంటే ఇప్పుడు చెప్పే హోమ్ రెమెడీలు సహాయం పొంది ఈజీగా తగ్గించుకోవచ్చు. అవేంటంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం. గొంతు నొప్పి, శ్లేష్మం వంటి సమస్యల నుంచి ఉపశమనానికి ఆవిరి పట్టుకోవాలి. ఆవిరి మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. స్టీమర్‌తో ఆవిరి పట్టేటప్పుడు దుప్పటి లేదా టవల్‌తో ముఖాన్ని కప్పుకోవాలి. కనీసం 5 నుంచి 7 నిమిషాల వరకు ఆవిరి పట్టాలి.ఒక లీటరు నీటిలో 1 టీస్పూన్ తులసి, ఎండుమిర్చి, ఎండు అల్లం, దాల్చిన చెక్కలను వేసి సన్నని మంటలపై బాగా వేడి చేయాలి. ఇందులోని ఔషధ గుణాలన్నీ నీళ్లలోకి వచ్చి కషాయం తయారు అవుతుంది. కషాయం తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.వేసవి కాలంలో ఐస్ క్రీం, శీతల పానీయాలు తాగడం చాలా సరదాగా ఉంటుంది. కానీ అవి గొంతు నొప్పికి దారి తీస్తుంటాయి. శీతల పానీయాలు కూడా శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తాయి. కాబట్టి పిల్లలు చల్లటి పదార్థాలు తినకుండా నివారించాలి.మనలో చాలా మంది బయట ఎండలో తిరిగి వచ్చిన తర్వాత, నేరుగా స్నానం చేయడానికి లేదా ముఖం కడగడం వంటివి చేస్తుంటారు. ఇది కూడా జలుబు, గొంతు నొప్పికి కారణం అవుతుంది. అందువల్ల, కొద్దిసేపు కూర్చున్న తర్వాత మాత్రమే నీళ్లను ముట్టుకోవడం మంచిది.ఎండ నుంచి ఇంటికి వచ్చిన వెంటనే ఏసీ, కూలర్ వేసుకుని కూర్చోవద్దు. ఇది వేడి, చలికి కారణమవుతుంది. దీని ప్రభావం గొంతుపై పడవచ్చు. మీరు ఏసీలో కూర్చోవాలనుకుంటే.. దాని ఉష్ణోగ్రత 25 డిగ్రీల లోపు ఉండేలా చూసుకోవాలి.





## గ్రీన్ బీన్స్ అంటే మీకు ఇష్టమా..?

సాధారణంగా ఇండియాలో పండిరచే కూరగాయలలో ఎన్నో పోషకాలు లభిస్తాయి అని ప్రతి ఒక్కరికి తెలుసు. కానీ గ్రీన్ బీన్స్ ఇండియాలో అంతంత మాత్రంగా పండిరచినా సరే,వీటిని చాలా ఇష్టంగా తింటారు.మరి ముఖ్యంగా ఫ్రైడ్ రైస్,పులావ్,బీన్స్ కర్రీ ,సలాడ్,పిజ్జా వంటి వాటిలో ఎక్కువ గ్రీన్ బీన్స్ వాడుతూ ఉంటారు.ఎవరైతే గ్రీన్ బీన్స్ ఇష్టంగా తింటారో,వారికి తెలియకుండానే ఎన్నో రోగాలకు అడ్డుకట్ట వేసుకుంటున్నారని చెబుతున్నారు ఆహార నిపుణులు. ఎందుకంటే ఈ గ్రీన్ బీన్స్ లో చాలా పోషకాలు లభిస్థాయట.అవి ఏంటంటే..ఒక కప్పు గ్రీన్ బీన్స్ లో కేవలం 31 కేలరీలు మాత్రమే లభిస్తాయి.మరియు వీటిలో ఫైబర్,విటమిన్ సి,కె,థయామిన్ మరియు నియాసిన్,విటమిన్ ఇ, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, జింక్ మరియు విటమిన్ ఇ,కెరటనాయిడ్స్ వంటి పోషకాలు పుష్కళంగా లభిస్తాయి. వీటిని తరుచూ ఉడకబెట్టి తీసుకోవడం వల్ల చాలా అనారోగ్యాలను దూరం పెట్టవచ్చు.అవేంటో మనము చూద్దాం పదండీ.. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తరచూ నీరసం, నిరుత్సాహం,అలసట,బాడీ పెయిన్స్,అనవసరమైన రోగాల బారిన పడుతుంటారు.అలాంటి వారికి గ్రీన్ బీన్స్ చాలా ఉపయోగపడతాయి. వారు రోజు 100 గ్రామ్స్ మోతాదులో గ్రీన్ బీన్స్ తీసుకోవడం వల్ల,ఇందులో ఉన్న విటమిన్ సి మరియు విటమిన్ ఈ రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. గ్రీన్ బీన్స్ లో ఉండే అన్ని అమైనో ఆసిడ్స్,పిగ్మెంట్ యాంటీయాక్సిడెంట్స్,ఫ్లెవనాయిడ్ పుష్కలంగా లభించడంతో,గౌట్ క్యాన్సర్,బ్రెస్ట్ క్యాన్సర్ సెల్స్ యొక్క ఉత్పత్తిని నిరోదించి,క్యాన్సర్ దరి చేరకుండా కాపాడుతుంది. రక్తంలోని షుగర్ లెవల్స్ ను క్రమబద్ధీకరించాలంటే,బీన్స్ లోని కార్బోహైడ్రేట్స్ అద్భుతంగా సహాయపడుతాయి. కావున మధుమేహంతో తరుచూ బీన్స్ తీసుకోవడం ఉత్తమం.అంతేకాక ఇందులో ఉండే బి6 విటమిన్ గర్భిణీ స్త్రీలకు మరియు కడుపులో వున్న బిడ్డకు కూడా పుష్కలంగా పోషకాలను అందించే మంచి ఆహారమని చెప్పవచ్చు. గ్రీన్ బీన్స్ లో కెరోటినాయిడ్స్ మరియు సిలికాన్ అధికంగా ఉంటాయి.ఇవి మీ కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది.జుట్టు, గోళ్లు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. మరియు ఫైబర్ జీర్ణక్రియ సమస్యలను కూడా ఈజీగా తగ్గిస్తుంది.అధిక కొలెస్ట్రాల్ తగ్గించి బరువు తగ్గడానికి దోహదపడుతుంది.



## పాలు ఎక్కువగా తాగితే ఈ సమస్యలా!

పాలు సంపూర్ణ ఆహారం. కానీ ఎక్కువ తాగితే సమస్యలు తప్పవు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పాలు ఎక్కువగా తాగడం వల్ల ఐరన్ లోపం ఏర్పడుతుంది. పాలు ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తాయి. మీకు రక్తహీనత సమస్య ఏర్పడే అవకాశం ఉంటుంది. అయితే, ప్రతిరోజూ 3 కప్పుల పాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. కల్తీ లేని తాజా పాలను తాగటం మంచిదని చెబుతున్నారు.పాలలో కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మీరు బరువు తగ్గాలనుకుంటే.. పాలను నివారించాలి.. లేదా చాలా తక్కువగా తీసుకోవాలి. లేదంటే పాలు ఎక్కువగా తాగడం వల్ల బరువు పెరుగుతారు. ఎరుపు రంగులో పగుళ్లు, దద్దుర్ల ఉన్నట్లైతే పాలు ఎక్కువగా తీసుకుంటున్నట్లు గుర్తు. ప్రిజర్వేటివ్స్ ఎక్కువగా యాడ్ చేస్తే.. ఈ లక్షణాలు ఇంకా తీవ్రమవుతాయి.పాలు ఎక్కువగా తాగటం వల్ల ముఖంపై మొటిమల సమస్య కూడా పెరుగుతుంది. మొటిమలు, మచ్చలతో బాధపడాల్సి ఉంటుంది.. పాలలోని కొన్ని రసాయనాలు ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి.అలాగే ఎక్కువ పాలు తాగే వారికి వారి శరీరం పాలకు అనుగుణంగా లేకుంటే అది పేగు సిండ్రోమ్‌కు దారి తీస్తుంది. దీని కారణంగా మీరు ఎల్లప్పుడూ నీరసంగా, అలసటగా ఉంటారు. ఎక్కువగా తలనొప్పి సమస్య కూడా వేధించే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలు ఎక్కువ తాగితే ఖచ్చితంగా బాడీలో తిమ్మిరి, ఉబ్బరం, అజీర్ణం, అతిసారం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు. శరీరం లాక్టోస్‌ను సరిగ్గా విచ్ఛిన్నం చేయలేకపోతే, అది జీర్ణవ్యవస్థ గుండా వెళుతుంది. గట్ బ్యాక్టీరియా ద్వారా విచ్ఛిన్నమవుతుంది. ఇది గ్యాస్ ఏర్పడటానికి, జీర్ణ సమస్యలకు దారితీస్తుంది.మన ఆరోగ్యానికి అన్ని రకాలుగా మేలు చేసే పాలు మితంగా అంటే రోజుకి రెండు మూడు సార్లు తాగితే మంచిది కానీ అతిగా తాగితే మాత్రం ఖచ్చితంగా ఆరోగ్య సమస్యలు తప్పవంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే పాలు ఎక్కువగా తాగడం వల్ల జీర్ణ సమస్యలతో పాటు ఇతర అనారోగ్య సమస్యలని కూడా ఖచ్చితంగా ఎదుర్కొవాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు..


## సింఘాడ తింటే కలిగే ప్రయోజనాలు..



వాటర్ చెస్ట్‌నట్ దీనినే సింఘాడ అని కూడా పిలుస్తారు.. ఈ సింఘాడ రుచిలో ఎంత టెస్టీగా ఉంటుందో దీంతో కలిగే ఆరోగ్యప్రయోజనాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ఇందులో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, మాంగనీస్ వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి అనేక రకాలుగా మేలు చేస్తాయి. కాల్షియం, పొటాషియం, మాంగనీస్, డైటరీ ఫైబర్, విటమిన్ బి6, విటమిన్ సి, కాపర్ వంటి పోషకాలు వాటర్ చెస్ట్‌నట్‌లో సమృద్ధిగా ఉంటాయి. ఈ సింఘాడలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది మీ జీర్ణక్రియకు సహాయపడుతుంది. మలబద్ధకం సమస్య దరిచేరకుండా చేస్తుంది. ఇందులో ఉండే కాల్షియం, పొటాషియం వాటర్ చెస్ట్‌నట్‌లో ఉంటాయి. కాబట్టి ఈ పండు ఎముకలు, దంతాలను బలంగా ఉంచడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. పొటాషియం పుష్కలంగా ఉన్న వాటర్ చెస్ట్‌నట్ హై బీపీ రోగులకు కూడా మేలు చేస్తుది. ఇది కాకుండా ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. అంతేకాదు.. వాటర్ చెస్ట్‌నట్‌లో నీరు సమృద్ధిగా ఉంటుంది. ఇది మిమ్మల్ని డీహైడ్రేషన్ నుండి రక్షిస్తుంది. ఇది తిన్న తరువాత చాలా సేపటి వరకు కడుపు నిండిన అనుభూతి కలిగిస్తుంది. ఆకలిని అదుపులో ఉంచుతుంది. దీంతో ఈజీగా బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. అంతేకాదు..ఇందులో చాలా తక్కువ కేలరీలు, కొవ్వు ఉంటుంది. ఫిట్‌నెస్‌కు ఉపయోగపడుతుంది. వాటర్ చెస్ట్‌నట్ తీసుకోవడం వల్ల జుట్టుకు బలం చేకూరుతుంది. ఎందుకంటే ఇందులో ఉండే లారిక్ యాసిడ్ మూలాలను బలంగా చేస్తుంది. దీంతో జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తుంది. ఇందులో ఉండే పొటాషియం, జింక్, విటమిన్ బి, విటమిన్ ఇ వంటి అనేక పోషకాలు జుట్టు, చర్మ సమస్యలను నివారిస్తుంది. ఇది శరీరం నుండి విషవ్యర్థాలను తొలగిస్తుంది. ఇది మంచి ఆరోగ్యంతో పాటు జుట్టు మూలాలను బలపరుస్తుంది. డయాబెటిస్ బాధితులు వాటర్ చెస్ట్‌నట్ తినడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే దీనిలో గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉండదు. దీంతో మధుమేహం బాధితుల్లో షుగర్ నియంత్రణలో ఉంటుంది.

## పడుకునే ముందు అరటిపండు తింటే ఏమవుతుందో తెలుసా..?

అరటిపండును పేదవాడి ఆపిల్ అంటారు..అన్ని కాలాలు, అన్ని వర్గాల వారికి అతి తక్కువ ధరలో అందుబాటులో ఉండేది అరటి పండు. ఇందులో పుష్కలమైన పోషకాలు నిండివున్నాయి. అరటిపండులో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్ మరియు మాంగనీస్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. ఇది ఆరోగ్యానికి మంచిది. అనేక ప్రయోజనాలను కలిగి ఉంటుంది. అలాంటి అరటి పండును రాత్రి నిద్రపోయే ముందు తినడం నిద్ర, జీర్ణక్రియ, మొత్తం ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. దీనికి సంబంధించిన మరింత సమాచారం ఇక్కడ తెలుసుకుందాం..మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్‌గా, మెలటోనిన్‌గా మారుతుంది. ఇవి నిద్రను నియంత్రించడంలో సహాయపడే న్యూరోట్రాన్స్‌మిటర్‌లు.కండరాల సడలింపు: అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉన్నాయి. ఇవి కండరాలను సడలించే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ఖనిజాలను కలిగి ఉంటాయి. పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి, మరింత ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: అరటిపండ్లు మితమైన గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అంటే అవి నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. పడుకునే ముందు ఒక్క అరటిపండు తినడం వల్ల రాత్రంతా రక్తంలో చక్కెర స్థాయిలలో వచ్చే చిక్కులు, క్రాష్‌లను నివారించవచ్చు. సంతృప్తిని ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లు ఫైబర్ మంచి మూలం. పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల రాత్రి సమయంలో ఆకలి బాధలను నివారిస్తుంది. దాంతో మరింత ప్రశాంతంగా నిద్రపోయేలా చేస్తుంది. పోషకాలు సమృద్ధిగా: అరటిపండ్లు విటమిన్లు సి, బి6, పొటాషియం, మాంగనీస్ వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి.



పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ శరీరానికి ఈ పోషకాలు అందుతాయి, ఇది మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహిస్తుంది.

# ఎంపీల కోసం కొత్తగా 184 నివాసాలు



పార్లమెంట్ సభ్యుల కోసం నిర్మించిన కొత్త నివాస గృహాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు దేశ రాజధాని ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో నిర్మించిన 184 టైప్-7 మల్టీ స్టోరీ ఫ్లాట్లను ప్రధాని ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఎంపీల నివాస సముదాయంలో ప్రధాని మోదీ 'సిందూర'మొక్కను నాటి, ఆ తర్వాత నిర్మాణంలో పాల్గొన్న శ్రమజీవులతో ముచ్చటిస్తారు. అనంతరం సభికులను ఉద్దేశించి ప్రసంగిచనున్నారు. స్వయం సమృద్ధి లక్ష్యంగా రూపొందించిన ఎంపీల నూతన నివాస సముదాయం పార్లమెంట్ సభ్యుల అవసరాలకు తగిన అన్ని ఆధునిక సదుపాయాలతో ఉంటుంది. ప్రతి యూనిట్ విస్తీర్ణం సుమారు 5 వేల చదరపు అడుగులు కాగా, ఇందులో నివాసంతో పాటు అధికారిక పనులకు అనుకూలంగా గదులను కేటాయించారు.

సిబ్బంది నివాసాలు, కార్యాలయాలు, కమ్యూనిటీ సెంటర్ వంటి సదుపాయాలు కల్పించారు. నివాస సముదాయంలో కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను అమలు చేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు. పర్యావరణ హిత సాంకేతికతతో నిర్మాణం చేపట్టి, గ్రీహ్ 3 స్టార్ రేటింగ్, నేషనల్ బిల్డింగ్ కోడ్-2016 ప్రమాణాలను అనుసరించారు.

దీంతో శక్తి పొదుపు, పునరుత్పత్తి ఇంధన వనరుల వినియోగం, వ్యర్థాల నిర్వహణలో మెరుగులు సాధ్యమవుతాయని అధికారులు పేర్కొన్నారు. అల్యూమినియం షట్టరింగ్ విధానంలో మోనోలితిక్ కాంక్రీట్ సాంకేతికతతో నిర్మాణం పూర్తి చేయడం వల్ల సమయానికి పనులు ముగిశాయని.. భూకంప నిరోధకంగా, దివ్యాంగులకు అనుకూలంగా ఈ భవనాలను రూపొందించారు. ప్రాజెక్ట్ కోసం భూమి పరిమితంగా ఉండటంతో అపార్ట్‌మెంట్ తరహా గృహ నిర్మాణం చేశారు.

# త్వరలో 6,500 కిలోల బరువైన అమెరికా శాటిలైట్ ప్రయోగం



అమెరికాలో నిర్మించిన 6,500 కిలోల బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని మరో రెండు నెలల్లో ప్రయోగించనున్నామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. సానా-ఇస్రోలు కలిసి జూలై 30వ తేదీన నైసార్ మిషన్ ప్రయోగం చేపట్టడం తెల్సిందే. ఇస్రో చైర్మన్ ఆదివారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇస్రో 1963లో ఏర్పాటు కాగా అదే ఏడాది అమెరికా బహుమతిగా అందజేసిన చిన్నపాటి రాకెట్‌తో భారత అంతరిక్ష యాత్ర మొదలైందని ఈ సందర్భంగా నారాయణన్ గుర్తు చేశారు.

ఇస్రో ప్రస్థానంలో ఈ జూలై 30వ తేదీ చరిత్రలో నిలిచిపో నుందని పేర్కొన్నారు. మనం ప్రయోగించిన నైసర్ ఇప్పటివరకు నిర్మించిన అత్యంత ఖరీదైన శాటిలైట్ అని వివరించారు. మరో రెండు నెలల్లో అమెరికా నిర్మించిన 6,400కిలోల భారీ ఉపగ్రహాన్ని సొంత నేలపై నుంచి ప్రయోగించనుండటం మనం సాధించిన ఘనతకు ఉదాహరణ' అని తెలిపారు. సొంత ఉపగ్రహ టెక్నాలజీయేలేని ఇస్రో 50 ఏళ్లలోనే 34 దేశాలకు చెందిన 433 శాటిలైట్లను ప్రయోగించిన స్థాయికి ఎదిగిందని వివరించారు. దేశాభివృద్ధి కోసం బ్రాడ్ కాస్టింగ్, టెలికమ్యూనికేషన్, డిజాస్టర్ వార్నింగ్, వాటర్ సెక్యూరిటీ తదితర 55 రకాల అప్లికేషన్లను ఇస్రో అందజేస్తోందన్నారు.

# ట్రంప్ &పుతిన్ భేటీపై యూరప్ దేశాల ఆందోళన, జెలెన్‌స్కీకి చోటు కల్పించాలని డిమాండ్



ఈ నెల 15వ తేదీన అలస్కాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన దౌత్యపరమైన విభేదాలకు తెరతీసింది. ఈ సమావేశంలో కుదరబోయే ఒప్పందంపై ఉప్పందుకున్న యూరప్ దేశాల నేతలు ఉక్రెయిన్ భవిష్యత్తును నిర్ణయించే భేటీలో అధ్యక్షుడు జెలెన్‌స్కీకి చోటు కల్పించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో సమావేశమైన యూరప్ దేశాల ఉన్నతాధికారులు..ట్రంప్ దౌత్య ప్రయత్నాలకు మద్దతు పలికారు. అదే సమయంలో, ట్రంప్-పుతిన్ చర్చల తర్వాత ముందుగా కాల్పుల విరమణ అమల్లోకి రావాలని, ఉక్రెయిన్‌కు సైతం ఒప్పందంలో భాగస్వామి అయ్యే అవకాశమివ్వాలని జేడీ వాన్స్‌ను కోరారు. అలస్కాలో శుక్రవారం పుతిన్-ట్రంప్ మధ్య జరిగే శిఖరాగ్రంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేరు లేదు. అయితే, జెలెన్‌స్కీ పాల్గొనే అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయలేమని వైట్ హౌస్ వర్గాలు అంటున్నాయి.

ట్రంప్-పుతిన్‌ల సమావేశం తర్వాత మాత్రమే జెలెన్‌స్కీకి చాన్సుంటుందని చెబుతున్నారు. వేగంగా చోటుచేసుకున్న పరిణామాల నడుమ అలస్కా శిఖరాగ్రంపై నిర్ణయం వెలువడింది. శిఖరాగ్రం వేదికను ఇంకా ఖరారు చేయలేదు. అంతేకాదు, ఇద్దరు నేతల మధ్య చర్చకు రావాల్సిన అంశాలపైనా స్పష్టత రాలేదని చెబుతున్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఇద్దరు నేతలతో కలిసి త్రైపాక్షిక చర్చలకు సైతం సిద్ధంగా ఉన్నా, పుతిన్ వినతి మేరకు ద్వైపాక్షిక చర్చలకు అవసరమైన ఏర్పాట్లు మాత్రమే చేస్తున్నామని వైట్ హౌస్ అధికారి ఒకరు తెలిపారు.

**యూరప్ నేతల డిమాండ్లివీ..**

అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అవనున్నట్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్..ఇందులో జెలెన్‌స్కీ పాల్గొనేదీ లేనిదీ మాత్రం స్పష్టం చేయలేదు. యుద్ధానికి ముగింపు పలికే విషయంలో ఉక్రెయిన్‌ను కూడా భాగస్వామిగా చేర్చుకోవాలని జెలెన్‌స్కీతోపాటు యూరప్ దేశాల నేతలు కోరుతున్నారు. ట్రంప్ ప్రకటనను స్వాగతించిన జెలెన్‌స్కీ, తమ భూభాగాన్ని రష్యాకు ధారాదత్తం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తోసిపుచ్చారు. పుతిన్-ట్రంప్ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే అంశాలేమిటి, కుదరనున్న ఒప్పందం వివరాలేమిటి? అంటూ జేడీ వాన్స్‌తో సమావేశమైన యూరప్ దేశాల ఉన్నతాధికారులు కూపీ లాగారు.

అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌కు పుతిన్ బుధవారం అందించిన పత్రాల్లో ఏముందంటూ ఆరా తీశారు. 'ఈ చర్చల్లో ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం ఉండాలి. చర్చల అనంతరం ముందుగా కాల్పుల విరమణ అమల్లోకి రావాలి. ఆ తర్వాతే మిగతా అంశాల అమలు విషయం తేల్చాలి. ఉక్రెయిన్ కొంత భూభాగాన్ని కోల్పోవాల్సి వస్తే..ప్రస్తుతం రష్యా ఆక్రమించుకున్న భూభాగాలను వెనక్కి ఇచ్చేయాలి ...'వంటి షరతులను వారు జేడీ వాన్స్‌కు వినిపించారు. ఇందుకు సంబంధించిన ప్రకటనపై ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, పోలండ్, యూకే, ఈయూ, ఫిన్లాండ్ దేశాల నేతలు సంతకాలు చేశారు.

ఉక్రెయిన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకూ గ్యారెంటీ ఇవ్వాలని కోరారు. తమ ప్రతినిధి విట్కాఫ్ మాస్కోలో పుతిన్‌తో జరిపిన సమావేశంలో కుదిరిన ఒప్పందంపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్.. కొన్ని భూభాగాలను వదులుకోవడం వంటి అంశాలున్నాయని చెప్పడం యూరప్ దేశాలతోపాటు జెలెన్‌స్కీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పుతిన్ అందజేసిన పత్రంలో తాము పాక్షికంగా ఆక్రమించుకున్న ప్రాంతాలతో పాటు డోన్‌బాస్ ప్రాంతం పూర్తిగా స్వాధీనం చేయాలనే అంశం ఉన్నట్లు యూరప్ దేశాలంటున్నాయి. ఖెర్సన్, జపొరిజియాల్లోనూ రష్యా ఆర్మీ తిష్టవేసింది. వీటి విషయం తేల్చలేదు. అమెరికా ఇచ్చే భద్రతాపరమైన గ్యారంటీల విషయం సైతం అస్పష్టంగా ఉంది. దీనిపై వైట్ హౌస్ అధికారులను ఈయూ నేతలు పదేపదే ప్రశ్నిస్తున్నా స్పందనలేదు.




# చాట్‌జీపీటీని నమ్మి.. ఆస్పత్రి పాలై..

ఏఐ సలహావల్ల ఈ రకమైన పాయిజనింగ్ జరగడం ప్రపంచంలో ఇదే మొదటిసారి కావచ్చునని వైద్యులు చెబుతున్నారు. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన వైద్యులు ఈ వింత కేసు వివరాలను 'అనల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్ : క్లినికల్ కేసెస్' అనే జర్నల్‌లో ప్రచురించారు. వారి కథనం ప్రకారం.. ఒక వ్యక్తి తన ఆహారంలో ఉప్పుకు బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయం కోసం చాట్‌జీపీటీని సలహా అడిగాడు. దానికి ఏఐ సోడియం బ్రోమైడ్‌ను సూచించింది.

కానీ దానివల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ఎలాంటి హెచ్చరిక చేయలేదు. దాంతో ఆ వ్యక్తి మూడు నెలలపాటు దాన్ని తీసుకున్నాడు. కొంతకాలానికి అతని ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. తన పొరుగింటివారు తనపై విష ప్రయోగం చేస్తున్నారని భయపడి ఆసుపత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించగా.. అతడిలో దాహం వేస్తున్నా నీళ్లు తాగడానికి నిరాకరించడం, భ్రమలకు లోనవడం, తీవ్రమైన ఆందోళన వంటి లక్షణాలు కనిపించాయి.

అతని పరిస్థితి మరింత దిగజారి, మతిస్థిమితం కోల్పోవడంతో వైద్యులు అతడిని మానసిక చికిత్స కోసం ప్రత్యేక వార్డుకు తరలించాల్సి వచ్చింది. చికిత్సలో భాగంగా అతనికి యాంటీసైకోటిక్ మందులు, ఫ్లూయిడ్స్ ఎక్కించడంతో క్రమంగా కోలుకున్నాడు. ఆ తర్వాత అసలు విషయం వైద్యులకు చెప్పాడు. ఉప్పుకు బదులుగా ఏఐ చెప్పిన సలహా పాటించానని, అదే ఈ పరిస్థితికి కారణమవుందనుకోలేదని వాపోయాడు.

ఆసక్తికరంగా వైద్యులు అదే ప్రశ్నను మళ్లీ చాట్‌జీపీటీని అడిగినప్పుడు.. అది మళ్లీ బ్రోమైడ్‌ను సూచించింది. కానీ దానివల్ల కలిగే దుష్ప్రభావాల గురించి మాత్రం హెచ్చరించలేదు. గతంలో బ్రోమైడ్ సమ్మేళనాలను ఆందోళన, నిద్రలేమి మందులలో వాడేవారు. కానీ వాటి తీవ్ర దుష్ప్రభావాల కారణంగా దశాబ్దాల క్రితమే నిషేధించారు. ప్రస్తుతం పశువుల మందులు, కొన్ని పారిశ్రామిక ఉత్పత్తులలో మాత్రమే బ్రోమైడ్‌ను వాడుతున్నారు. కాగా బాధిత వ్యక్తి సుమారు మూడు వారాల చికిత్స తర్వాత పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలిపారు. అయితే శాస్త్రీయ సమాచారం కోసం ఏఐ ఉపయోగపడినా, వైద్య సలహాలకు మాత్రం దానిని ఎప్పటికీ ప్రత్యామ్నాయంగా భావించరాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# అధిక స్క్రీన్ టైమ్‌తో పిల్లలకు గుండె జబ్బుల ముప్పు!

ఇటీవలి కాలంలో అందరూ టీవీలు, స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్లకు అతుక్కుపోతున్నారు. గంటలకొద్దీ స్క్రీన్‌లపై గడిపితే ముఖ్యంగా పిల్లల్లో గుండె జబ్బుల ముప్పు పెరుగుతుందని డెన్మార్క్‌లోని కోపెన్‌హెగెన్ వర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. 'జర్నల్ ఆఫ్ అమెరికన్ హార్ట్ అసోసియేషన్' కథనం ప్రకారం, కార్డియోమెటబాలిక్ వ్యాధులకు దారితీసే అంశాలకు, స్క్రీన్ టైమ్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించేందుకు వెయ్యిమంది పిల్లలపై సైంటిస్టులు అధ్యయనం చేపట్టారు.

10 ఏండ్లు, 18 ఏండ్ల పిల్లల స్క్రీన్ టైమ్, నిద్ర తీరులను పరిశీలించారు. 'ఎలక్ట్రానిక్ పరికరాలతో అధిక సమయం గడుపుతున్న పిల్లలు, టీనేజర్లలో కార్డియోమెటబాలిక్ వ్యాధులు వస్తున్నాయి. అధిక బీపీ, అధిక కొవ్వు, ఇన్సులిన్ నిరోధకత వంటివి తలెత్తే అవకాశముంది' అని నివేదిక పేర్కొన్నది. రోజువారీ స్క్రీన్ సమయం ప్రతి అదనపు గంట వ్యాధి ప్రమాదాన్ని పెంచుతున్నదని నివేదిక తెలిపింది.






# ప్రతి ఏటా 1.5 ట్రిలియన్ డాలర్ల ఆరోగ్య నష్టం

ప్లాస్టిక్ వాడకంతో ఏర్పడుతున్న కాలుష్యం ప్రపంచానికి పెనుముప్పుగా మారింది. కేవలం ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం కోసం ప్రతి ఏటా జరుగుతున్న వ్యయం 1.5 ట్రిలియన్ డాలర్లు (సుమారుగా రూ.131 లక్షల కోట్లు)గా ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. 'ద లాన్సెట్ మెడికల్ జర్నల్' కథనం ప్రకారం, బాల్యం నుండి వృద్ధాప్యం వరకు వ్యాధులు, మరణాలకు ప్లాస్టిక్ కాలుష్యం కారణమని నివేదిక గుర్తించింది.

ఆరోగ్యానికి సంబంధించి ఆర్థిక నష్టాలకు దారితీస్తున్నదని హెచ్చరించింది. ప్రకృతిలో, మానవ శరీరంలో మైక్రోప్లాస్టిక్ చేరుతుండటంపై పలు నివేదికలు ఇప్పటికే హెచ్చరించాయని తెలిపింది. ఏటా ఎన్నో వేల మంది మరణానికి ప్లాస్టిక్ కాలుష్యం కారణమని పరిశోధకుల్లో ఒకరైన డాక్టర్ ఫిలిప్ లాండ్రిగాన్ అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడంపై తొలి సదస్సు త్వరలో జెనీవాలో మొదలుకానున్నది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# ఉస్తాద్ భగత్ సింగ్ ప్రమోషన్స్ షురూ అయ్యేది అప్పుడేనట..!



పవన్ కల్యాణ్ ఇటీవలే హరిహరవీరమల్లు పార్టు 1 సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఇక ప్రస్తుతం ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలపై తన ఫోకస్ అంతా పెట్టాడు. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్‌పై దండయాత్ర చేయడం పక్కా అని ధీమాగా ఎదురుచూస్తున్నారు అభిమానులు, ఫాలోవర్లు. వీటిలో సుజిత్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఓజీ సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

పవన్‌కల్యాణ్ హరీష్‌శంకర్ దర్శకత్వంలో టైటిల్ రోల్ పోషిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్. లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చేసింది. ఉస్తాద్ భగత్ సింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌కు సంబంధించి మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారట. ఓజీ విడుదల అయ్యే వరకు ఉస్తాద్ భగత్ సింగ్ ప్రమోషన్స్‌ను మొదలు పెట్టొద్దని ఫిక్స్ అయ్యారని ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం ఓజీ విడుదలయ్యాకే ఉస్తాద్ భగత్ సింగ్ ప్రమోషన్స్ షురూ కానున్నాయి. అంతేకాదు ఉస్తాద్ భగత్ సింగ్ ఫస్ట్ సింగిల్‌ను అక్టోబర్ తొలి లేదా రెండో వారంలోలాంచ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ లెక్కన ఓజీ ఒక్కసారి థియేటర్లలోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఆ మేనియా నుంచి అభిమానులు బయట పడ్డాక ఉస్తాద్ భగత్ సింగ్ సందడి మొదలు కానుందన్నమాట. ఏదైమైనా పవన్ కల్యాణ్ టీం అభిమానులకు గ్యాప్ లేకుండా వినోదాన్ని అందించాలని గట్టిగానే ఫిక్సయినట్టు తాజా వార్తలు చెప్పకనే చెబుతున్నాయి.

భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ ఉస్తాద్ భగత్ సింగ్‌లో తనదైన మ్యానరిజంతో సాగుతున్న పవన్ కల్యాణ్ డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రంలో శ్రీలీల ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

# జోడీగా మృణాల్ ఠాకూర్ కావాలన్న స్టార్ హీరో

సాధారణంగా హీరోయిన్లు పలానా హీరో సరసన నటించాలని కోరుకుంటుంటారు. అయితే తాజాగా ఓ స్టార్ హీరోనే తనకు జంటగా పలానా హీరోయిన్ అయితే బాగుంటుందని చెప్పడం విశేషం. ఆ హీరో ఎవరో కాదు శివకార్తికేయన్. వరుస విజయాలతో స్టార్ హీరోగా రాణిస్తున్న ఈయన ప్రస్తుతం ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో యాక్ట్ చేస్తున్న మదరాశి చిత్ర నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఇందులో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా నటిస్తున్న పరాశక్తి షూటింగ్ కూడా శరవేగంగా జరుపుకుంటోంది. రవి మోహన్ ప్రతినాయకుడిగా నటిస్తున్న ఇందులో అధర్వ మురళి ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా తర్వాత శివకార్తికేయన్ వెంకట్‌ప్రభు దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. ఈ మూవీ షూటింగ్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుందని తెలుస్తోంది.





# ఎన్టీఆర్ దీవెనలు చల్లని చూపు నాపై ఉన్నంతవరకూ ఎవరూ నన్నేం చేయలేరు

'25 ఏళ్ల క్రితం తొలి సినిమా 'నిన్ను చూడాలని' ఓపెనింగ్‌కి వెళ్లినప్పుడు నాతో అమ్మానాన్న తప్ప ఎవరూ లేరు. ఇప్పుడు కోట్లాదిమంది నాతో ఉన్నారు. దీనికి కారణం తల్లిదండ్రుల ఆశీస్సులు. అన్నింటినీ మించి మా తాతగారు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్‌గారి దీవెనలు. ఆయన చల్లని చూపు నాపై ఉన్నంతవరకూ ఎవరూ నన్నేం చేయలేరు. అభిమానుల్ని ఆనందింపజేయడమే నా ముందున్న లక్ష్యం. మీకోసం ఎంతదూరం అయినా వెళ్తా. ఎక్కడికెళ్లాలనుకున్నా మిమ్మల్ని తీసుకొనే, మీతోపాటు వెళ్తా.' అని ఎన్టీఆర్ నర్మగర్భంగా మాట్లాడారు. ఆయన, హృతిక్ రోషన్ హీరోలుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన భారీ పానిండియా సినిమా 'వార్ 2'. కియారా అద్వానీ కథానాయిక. బ్లాక్‌బస్టర్ 'వార్'కి సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో తారక్ మాట్లాడారు. ఇంకా చెబుతూ "కహోనా ప్యార్‌హై'లో హృతిక్ డాన్స్ చూసి పిచ్చివాడ్నైపోయా. ఇండియాలో ఈ రోజు ఫైనెస్ట్ యాక్టర్ ఎవరైనా ఉన్నారంటే అది హృతిక్ రోషన్ మాత్రమే. ఆయన ఎంత గొప్ప నటుడో, అంత గొప్ప వ్యక్తి.

దేశంలో ఆయనంత డాన్సర్ లేరు. అలాంటి వ్యక్తితో డాన్స్ చేయడం, కలిసి నటించడం నా అదృష్టం. డాన్స్‌లో ఆయనతో పోటీ పడటం సాహసం. కనీసం మ్యాచ్ చేయడానికి ప్రయత్నించా. ఇది నా తొలి హిందీ సినిమా. అలాగే హృతిక్‌సార్ తొలి తెలుగు సినిమా. తెలుగువారి ఆదరణ ఎలా ఉంటుందో ఈ సినిమాతో నిరూపణ అవ్వడం ఖాయం. ఇది అయాన్ ముఖర్జీ సినిమా. దేశం గర్వించదగ్గ దర్శకుడిగా ఎదుగుతారు తను. అంత గొప్పగా ఈ సినిమా తీశారు ' అని ఎన్టీఆర్ అన్నారు. హృతిక్ రోషన్ మాట్లాడుతూ 'తారక్ మీకు అన్న. నాకు తమ్ముడు. మీ అందరికీ ప్రామిస్ చేస్తున్నా. ఎప్పటికీ ఈ బంధం ఇలాగే ఉంటుంది. మనం ఓ ఫ్యామిలీ. 'క్రిష్' షూటింగ్ టైమ్‌లో హైదరాబాద్ వచ్చాను. తెలుగు ప్రజల ఇచ్చే గౌరవం నాకు తెలుసు. నాలుగురోజుల్లో 'వార్ 2' రాబోతున్నది. ఇందులో కబీర్ పాత్రను ఎంజాయ్ చేస్తూ చేశా. పులి లాంటి ఎన్టీఆర్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం. ఏ షాట్ అయినా వందశాతం న్యాయం చేసే గొప్ప నటుడు తారక్. అభిమానుల కోసం ఏదైనా చేస్తాడు తను. తన నుంచి చాలా నేర్చుకున్నా. అదంతా నా ఫ్యూచర్ సినిమాల్లో అనుసరిస్తా.' అని తెలిపారు. ప్రచార చిత్రాల్లో మేం చెప్పని ఓ అద్భుతమైన కథ ఈ సినిమాలో ఉందని, అది సర్‌ప్రైజ్‌కు గురిచేస్తుందని అయాన్ ముఖర్జీ చెప్పారు. ఇంకా త్రివిక్రమ్ శ్రీనివాస్, దిల్ రాజు, సూర్యదేవర నాగవంశీ కూడా మాట్లాడారు.



# హార్రర్ సినిమాతో రాబోతున్న మాళవిక మనోజ్

మలయాళ బ్యూటీ మాళవిక మనోజ్ 'జో' మూవీతో ఓవర్ నైట్ స్టార్‌గా మారింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇక ఇటీవల ఈ అమ్మడు 'ఓ భామ అయ్యో రామ' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. కానీ హిట్ రాబట్టుకోలేకపోయింది. అయినప్పటికీ మాళవిక నటనకు మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. మాళవిక ఓ హారర్, కామెడీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ప్రకటించింది. హిట్ మూవీ 'సుమతి వలవు' సీక్వెల్‌లో నటిస్తున్నట్లు తెలిపింది. అలాగే ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా షేర్ చేసింది. ఇందులో ఓ అడవిలో అమ్మాయి ముఖం ఆకారం కనిపించగా.. దారిలో కొందరు నడుస్తున్నట్లు ఉన్న పోస్టర్ అందరినీ భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఈ సినిమాకు విష్ణు శశి శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక ఇందులో బాలు వర్గీస్, గోకుల్ సురేష్, సైజు కురుప్, మాళవిక మనోజ్, శివద, గోపిక, నిరంజ్ మణియన్‌పిళ్లై, సిద్ధార్థ్ భరతన్, బాబీ కురియన్, శ్రవణ్ ముఖేష్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్ని వాటర్‌మ్యాన్ ఫిల్మ్స్ ఎల్ఎల్‌పి, శ్రీ గోకులం మూవీస్, మురళి కున్నుంపురత్, గోకులం గోపాలన్‌ల సహకారంతో ఈ మలయాళ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# ఆరు ప్రాజెక్ట్‌లు ప్రేక్షకులకు ఉత్తేజాన్ని అందిస్తాయి..

ప్రముఖ నిర్మాణ సంస్థ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ ఒకేసారి ఆరు ప్రాజెక్టులు అనౌన్స్ చేసి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టలుకు సంబంధించిన పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. అలాగే కేవలం రెండేళ్లలో ఆరు చిత్రాలను విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ విజయ్ చిల్లా ,శశి దేవిరెడ్డి సెన్సేషనల్ ప్రకటన చేశారు. "70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో మేము అధికారికంగా ఆరు కొత్త స్క్రిప్టులను నిర్మాణం కోసం లాక్ చేశామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. ఈ చిత్రాలు రెండు సంవత్సరాల్లో విడుదల కాబోతున్నాయి. ప్రతి ఒక్కటి పెద్ద స్క్రీన్‌పై మ్యాజిక్ చేయబోతున్నాయి. మా బ్యానర్‌లో వచ్చిన భలే మంచి రోజు, ఆనందో బ్రహ్మ వంటి ప్రాజెక్ట్స్ ప్రేక్షకులతో లోతుగా కనెక్ట్ అవ్వడమే లక్ష్యంగా పెట్టుకుని తీసినవే. మా కొత్త ప్రాజెక్ట్స్ కూడా ఉత్తేకరంగా ఉండబోతున్నాయి. రాబోయే రోజుల్లో నటీనటులు, సిబ్బంది గురించి ప్రకటిస్తాము. ఈ ఆరు సినిమాలు స్వరం, శైలిలో విభిన్నంగా ఉంటాయి. కానీ అవి ఒక సాఘధారణ థ్రెడ్‌ను పంచుకుంటాయి. తాజా, ఆలోచనలు, బలమైన భావోద్వేగాలు, నాణ్యమైన సినిమా, రాజీపడని నిబద్ధతను కలిగి ఉంటాయి. వాటిని జీవం పోసి పెద్ద తెరపై మీతో పంచుకోవడానికి మేము వేచి ఉండలేకపోతున్నాము" అని రాసుకొచ్చారు.



# బంపర్ ఆఫర్ అందుకున్న డిజాస్టర్ బ్యూటీ..

## ఈ సారైనా లక్ కలిసొచ్చేనా?



యంగ్ హీరోయిన్ రాశిసింగ్ 'శశి' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి రెస్పాన్స్‌ను దక్కించుకోవడంతో అమ్మడుకి ఫుల్ పాపులారిటీ దక్కింది. తెలుగులో అనతి కాలంలోనే అమ్మడు క్రేజీ బ్యూటీగా మారి వరుస అవకాశాలు అందుకుంటుంది. ఇక ఇటీవల 'బ్లైండ్ స్పాట్' మూవీతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం రాజ్ తరుణ్ 'పాంచ్‌మినార్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, రాశి సింగ్ మరో మూవీని ప్రకటించింది. 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' సినిమాలో నటిస్తున్నట్లు తెలుపుతూ దాని కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించింది. కాగా, గత కొద్ది కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న వద్దే నవీన్ ఈ మూవీలో రీఎంట్రీ ఇవ్వబోతున్నాడు. కమల్ తేజ నార్ల దర్శకత్వంలో తెరకెక్కుతుండగా.. రఘుబాబు, బాబా మాస్టర్, సాయిశ్రీనివాస్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను వద్దే క్రియేషన్స్ పేరుతో కొత్త నిర్మాణ సంస్థను ప్రారంభించి వద్దే నవీన్ నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in